సంపుటి : 9
సంచిక : 326
మంగళవారం
18 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999


# ఏపీపై ఎల్ నినో పంజా..

- రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న చంద్రబాబు
- నవంబర్ వరకు అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంచనా
- శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా తగ్గిన నీటి ప్రవాహం
- నీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్న సీఎం



**అమరావతి, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 2026 జూన్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో 867 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 557 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయని తెలిపారు. జులై నెలలో కొన్ని జిల్లాల్లో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం చొప్పున లోటు కొనసాగవచ్చని హెచ్చరించారు. అయితే, డిసెంబర్‌లో మాత్రం 1 శాతం అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాలు, ప్రాజెక్టులలో నీటి మట్టాలు వేగంగా అడుగంటుతున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయానికి ఈ సీజన్‌లో 753 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 214 టీఎంసీలు మాత్రమే వచ్చిందని సభకు తెలిపారు. ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలోని రిజర్వాయర్లు నిండిన తర్వాతే మనకు నీరు విడుదల చేస్తారని, ఈ కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజె క్టులకు నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోయిందని వివరించారు. కృష్ణా బేసిన్‌తో పాటు గోదావరి బేసిన్‌లోనూ

తరువాయి.. 2లో..

### స్కూల్లో గోడ కూలి

# పదో తరగతి విద్యార్థి మృతి

**స్పందించిన మంత్రి నారా లోకేశ్**

**పార్వతీపురం జిల్లా సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విషాదం**



**ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పాఠశాల ప్రహరీ గోడ కూలిపోవడంతో 10వ తరగతి చదువుతున్న తుపాకుల అరుణ్ తేజ (15) అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, సొండి యాకూబ్ అనే మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులిద్దరూ వాలుగా ఉన్న ప్రహరీ గోడపై కూర్చోవడంతో అది ఒక్కసారిగా కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన విద్యార్థిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఎదిగిన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాఠశాల ప్రాంగణంలోనే మృతదేహంతో ధర్నాకు దిగారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థి మరణించడం కలచివేసిందని, గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అరుణ్ తేజ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

### కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను

# నీరుగార్చే కుట్ర

**రేవంత్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం**



**హైదరాబాద్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** తెలం గాణలో పేదల సంక్షేమానికి సంబం ధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబా రక్ పథకాలను రద్దు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాలను యథాతథంగా కొనసాగించాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన భారీ ధర్నాలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ పథకాలపై కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసి కూడా, కావాలనే ప్రభుత్వం తరఫున

తరువాయి.. 2లో..

# తెలంగాణలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

**జాబితాలో పేరు లేనివారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

**వివరాల్లో తప్పులుంటే ఫారం-8 ద్వారా సరిచేసుకునే అవకాశం - అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**




**తెలంగాణా, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) 2026కు సంబం ధించిన ముసాయిదా జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమ వారం విడుదల చేశారు. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారు ఫారం-6 ద్వారా తిరిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు అందాయని, ఇది మొత్తం ఓటర్లలో 78.30 శాతమని అధికారులు వెల్లడించారు. వీరిలో అధిక శాతం ఓటర్లను ఏఎస్‌డీడీ (గైర్హాజరు, చిరునామా మార్పు, మృతి, డూప్లికేట్) కేటగిరీ కింద చేర్చారు. శాశ్వతంగా చిరునామా మారిన వారు, అందుబాటులో లేని వారు, మరణించిన వారు, వేర్వేరు చోట్ల ఓటు హక్కు ఉన్న వారు కలిపి మొత్తం 73,39,235 మంది ఈ కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటింటి సర్వే చేపట్టిన సమయంలో బూత్ స్థాయి అధికారులు ఈ వివరాలను సేకరించారు.

**జాబితాలో పేరు లేకుంటే ఏం చేయాలి?**

ముసాయిదా జాబితాలో పేరు లేని వారు లేదా ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారు కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుతో పాటు వయసు, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను

తరువాయి.. 2లో..

### రేవంత్ ఇల్లు కూడా

# నిషేధిత జాబితాలో ఉంది

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు**



**హైదరాబాద్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగిం చేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

### బీజేపీలో చేరిన

# టాలీవుడ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు**

**'ఢీ', 'బిగ్‌బాస్' షోలతో పాటు పలు హిట్ సినిమాలకు పనిచేసిన శ్రష్టి**



**హైదరాబాద్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రముఖ డాన్స్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సోమవారం ఆమె బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

తరువాయి.. 2లో..

### నాగబాబుకు

# కేబినెట్ హోదాతో పదవి

**చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్**

**సోదరుడి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్**



**అమరావతి,ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు

తరువాయి.. 2లో..

# కోనసీమలో కలకలం..

**ఈ నెల 3న చేపల వేటకు వెళ్లి తిరిగిరాని మత్స్యకారులు**

**ఈ నెల 13 నాటికే తిరిగి రావాల్సిన మత్స్యకారులు**

**ఫోన్లలో కూడా వారిని సంప్రదించేందుకు వీలుకాని వైనం - అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం**



**కోనసీమ, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగిరాకపోవడంతో కోనసీమ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో ఈ నెల 3న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారని, నిర్ణీత గడువు ప్రకారం ఈ నెల 13 నాటికే తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒడ్డుకు చేరలేదని జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. మత్స్యకారుల వద్ద 15 రోజులకు సరిపడా రేషన్ నిల్వలు, 1,000 లీటర్ల డీజిల్ మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో ఫోన్లలో కూడా వారిని సంప్రదించేందుకు వీలుకాకపోవడంతో జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తమైంది. బోటు విశాఖపట్నం నుంచి ఒడిశాలోని పారాదీప్ తీర ప్రాంతాల వైపు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడన పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, పరిస్థితి తీవ్రతను గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే ఇండియన్ కోస్ట్‌గార్డ్‌తో పాటు

తరువాయి.. 2లో..

### విశాఖ విమానాశ్రయంలో కార్యకలాపాలు ఆగిపోవడంతో

# చాలా మంది బాధపడుతున్నారు

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**



**విశాఖపట్నం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** విశాఖ పట్నం ఎయిర్‌పోర్టులో విమాన కార్యకలాపాలు నిలిపివేయడంతో ఎందరో బాధపడుతున్నారని, అయితే కొన్ని మంచి పనులు జరిగినప్పుడు కొంతమేర బాధ ఉండటం సహజమేనని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఈరోజు నుంచి భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి

తరువాయి.. 2లో..

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. రాహుల్ గాంధీకి ఊరట



**న్యూఢిల్లీ, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో నివేదికను అలహాబాద్ హైకోర్టులో సమర్పించొద్దని ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ జరిగేవరకు ముందుకు తీసుకువెళ్లొద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఈ విషయం అంత తీవ్రమైనదైతే.. ఇన్నాళ్లూ దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించి

తరువాయి.. 2లో..

# విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత



**అస్సాం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు

తరువాయి.. 2లో..

### ఇరాన్‌పై అణుదాడికి

# అమెరికా చర్చలు

**అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు**



**ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ.. ఇరాన్‌పై అణు దాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని

తరువాయి.. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఏపీపై ఎల్ నినో పంజా..

ఇదే పరిస్థితి ఉందని అన్నారు. నీటి సమస్యలు కేవలం రాష్ట్రాల మధ్యే కాకుండా గ్రామాలు, దేశాల మధ్య కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయని, కావేరి జలాల వివాదమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణ, వృథాను అరికట్టడంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

## నీరుగార్చే కుట్ర

సరైన వాదనలు వినిపించకుండా కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు వచ్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ, ఈ సంక్షేమ పథకాలను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతుండటం విచారకరమన్నారు. అలాగే నల్గొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుని అనర్హులకు ఇచ్చారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. జాయింట్ కలెక్టర్ మెమోరాండం స్వీకరించేందుకు రాగా బీఆర్ఎస్ నాయకులు ఇచ్చేందుకు నిరాకరించారు. చివరకు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు అనుమతించడంతో, నాయకులు కలెక్టర్‌ను నేరుగా కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు.

## తెలంగాణలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

జత చేయాలి. దరఖాస్తులో పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, కుటుంబ సభ్యులలో ఒకరి వివరాలు, పూర్తి చిరునామా, ఓటర్ ఐడీ నంబర్ (ఉంటే) వంటి సమాచారాన్ని పొందుపరచాలి.

**జాబితాలో పేరు ఉండి వివరాలు తప్పుగా ఉంటే..?**

ఇప్పటికే జాబితాలో పేరు ఉండి, వివరాల్లో తప్పులు (పేరు, ఫోటో, చిరునామా మార్పు) ఉన్న వారు ఫారం-8 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో సవరణలు చేసుకోవచ్చు. అభ్యంతరాలు, చేర్పుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఓటర్లు తమ వివరాలను సీఈఓ తెలంగాణ లేదా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో తనిఖీ చేసుకుని, అవసరమైన మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## టాలీవుడ్ కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ

ఎన్. రామచందర్ రావు ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులు ఏకమవుతున్న తరుణంలో, యువత రాజకీయాల్లోకి రావడం, ముఖ్యంగా బీజేపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. యువత ప్రాతినిధ్యంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రేష్టి వర్మతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేష్టి వర్మ, ఈటీవీలో ప్రసారమైన 'ఢీ', 'ఢీ జోడీ' వంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. అనంతరం ఆమె 'బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9'లో కంటెస్టెంట్‌గా కూడా పాల్గొన్నారు. కొరియోగ్రాఫర్‌గా తెలుగు, తమిళ, హిందీ చిత్ర పరిశ్రమలలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇటీవల విడుదలైన 'పుష్ప 2'లోని 'సూసేకి', రజినీకాంత్ 'జైలర్' చిత్రంలోని 'నువ్వు కావాలయ్యా' వంటి బ్లాక్‌బస్టర్ గీతాలకు నృత్య దర్శకత్వం వహించారు. వీటితో పాటు 'అల వైకుంఠపురములో', 'క్రాక్', 'బీస్ట్', 'గేమ్ ఛేంజర్' వంటి పలు విజయవంతమైన చిత్రాలకు ఆమె పనిచేశారు.

## కేబినెట్ హోదాతో పదవి

తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## కోనసీమలో కలకలం..

జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో సమన్వయం చేసుకుని సముద్రంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బోటు యజమాని, బాధిత కుటుంబాల వివరాలను సేకరించి కోస్ట్‌గార్డ్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో తమ వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు.

## చాలా మంది బాధపడుతున్నారు

కమర్షియల్ ఆపరేషన్స్ అధికారికంగా ప్రారంభమైనట్లు వెల్లడించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. జీఎంఆర్ సంస్థ ప్రాణం పెట్టి నిర్మించిన ఈ విమానాశ్రయ నిర్మాణం మన ప్రాంత చరిత్ర, సంస్కృతికి అద్దం పడుతోందని ప్రశంసించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టును భవిష్యత్తులో ఏ విధంగా సమర్ధవంతంగా వినియోగించుకోవాలనే దానిపై స్పష్టమైన ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. వైజాగ్ నుంచి కనెక్టివిటీ కోసం రోడ్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయని, బీచ్ కారిడార్ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా పిలిచేవారని, కానీ తమ ప్రభుత్వ హయాంలో విజయనగరం సర్వాంగ సుందరంగా అభివృద్ధి చెందుతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లాలో నిర్మించిన ఈ బృహత్తర విమానాశ్రయాన్ని చూస్తుంటే ప్రపంచమే మన దగ్గర ఉందనే అద్భుతమైన అనుభూతి కలుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర ప్రగతి పథంలో ఒక నూతన శకం, సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీకి ఊరట

ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన భాజపా నేత దర్యాప్తు సంస్థలకు చేసిన ఫిర్యాదుపై గతంలో అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఈడీ, సీబీఐలను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది.

## జీతంలో 20శాతం కోత

ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

## అమెరికా చర్చలు

పేర్కొన్నారు. ఈ అణు దాడుల వల్ల ప్రపంచం మొత్తం పెద్ద సంఘర్షణలోకి.. ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలు ముందుకు వచ్చి.. ఆయన చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణ్వాయుధాలను ప్రయోగించిన విషయాన్ని టేలర్ గ్రీన్ గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో సంక్రమించే లోపాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే పరిస్థితి ఇరాన్‌కు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**యుద్ధ నీడలో జీవించలేం..**

యుద్ధం జరుగుతున్నంతకాలం ప్రజలు భయపడుతూనే జీవించాల్సి ఉంటుందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తొలగిపోయి శాంతియుత వాతావరణం నెలకొనేలా దౌత్య విధానాలను అవలంభించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇన్నాళ్లు బాహ్య ఒత్తిడిని తట్టుకొని ప్రభుత్వం నిలబడినప్పటికీ.. యుద్ధ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు.

# విద్య మార్కులతోనే కొలవలేం

**తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రసంగం**

**స్వతంత్ర ఆలోచనలకు విద్య దోహదపడాలి - పరిశోధన, నవకల్పనలకు ప్రాధాన్యం**

**జీవితాంతం నేర్చుకునే తత్వం అవసరం : ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్**




**తిరువారూర్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్:** భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్ట భద్రులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రస్తుత కాలంలో విద్యను కేవలం పరీక్షలు లేదా మార్కుల ఆధారంగా మాత్రమే అంచనా వేయ కూడదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యం, వ్యక్తిత్వ వికాసం, సమాజ పట్ల బాధ్యత పెంపొందించడం కూడా విద్య లక్ష్యంగా ఉం డాలని అన్నారు. స్వతంత్రంగా ఆలోచించే సామ ర్థ్యం, సమర్థవంతంగా భావాలను వ్యక్తపరచగల నైపుణ్యం, ఇతరులతో కలిసి పనిచేసే గుణం, జీవితాంతం నేర్చుకుంటూ ముందుకు సాగే తత్వం విద్య ద్వారా అభివృద్ధి చెందాలని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ లక్షణాలే భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువతకు బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ జ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, ప్రపంచవ్యాప్త పోటీ నేపథ్యంలో విద్యార్థులు కొత్త ఆలోచనలకు, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయం బహుళశాఖల విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఉపరాష్ట్రపతి ప్రశంసలు తెలిపారు. పరిశోధన, నవకల్పన, విలు వల ఆధారిత విద్యకు విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వాలతో తీర్చిదిద్దే దిశగా విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని కొనియాడారు. విద్యాసంస్థలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడే జ్ఞాన కేంద్రాలుగా ఎదగాలని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, విద్య ద్వారా పొందిన జ్ఞానాన్ని సమాజ ప్రయోజనాలకు వినియోగించాలని పట్టభద్రులకు సూచించారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పట్టాలు పొందిన విద్యార్థులకు ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి

**అసెంబ్లీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు అనుసరించాలి**

**మంత్రి నాదెండ్ల మనోహర్**



**అమరావతి, ఆగస్ట్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** 'అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున జనసేన బలమైన గొంతు వినిపించాలి. అసెంబ్లీ జరిగే ప్రతి నిమిషం విలువైనదే. ప్రజలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ప్రజాప్రతినిధులుగా బాధ్యతగా సభ ముందుకు తీసుకురావాలి. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొనాల'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు, జనసేన లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి తీవ్ర జ్వరం ఉండటం మూలంగా సభకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రివర్యులు అందించే సూచనలు అనుసరిస్తూ సభా కార్యక్రమాలలో పాలుపంచుకుందాము అన్నారు. శాసనసభ వర్షకాల సమావేశాలు సోమవారం మొదలైన సందర్భంగా సభలో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని మంత్రికందుల దుర్గేష్, ఎమ్మెల్సీ నాగబాబుతో కలిసి మనోహర్ సోమవారం అసెంబ్లీలోని జేఎల్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ "ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం దొరుకుతుంది. ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి మార్గదర్శకంలో సభలో జనసేన సభ్యులందరం హుందాగా, క్రమశిక్షణగా నడుచుకోవాలి. చర్చ సందర్భంగా ప్రతి విషయం మీద లోతుగా అధ్యయనం చేసి సభలో మాట్లాడాలి. అలాగే నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించేలా ప్రజల గళం కావాలి. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం రాష్ట్రంపై ఉండే అవకాశం కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య, సాగునీటి సమస్యలను సభలో చర్చించేందుకు సమాయత్తం కావాలి. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా పనిచేయాలి. వివిధ కీలక అంశాల మీద సభలో జరిగే చర్చలో జనసేన పార్టీకి కేటాయించే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మండలి సమావేశాలకు వైసీపీ వచ్చినా, సభను సజావుగా జరగకుండా అడ్డుపడటమే వారి ఉద్దేశంగా కనిపిస్తోంది. అక్కడ కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. అన్ని చర్చల్లో పాల్గొవాలి. శాసనసభ, మండలి జరిగే అన్ని రోజుల్లో జీరో అవర్ నుంచి ప్రశ్నోత్తరాలకు, చర్చలకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉండాలి" అని సూచించారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు : మంత్రి అచ్చెన్నాయుడు

**విద్యాశాఖ మంత్రిగా ఉండి నిరుద్యోగులను మోసం చేసింది బొత్స కాదా? - ఐదేళ్లు యువత జీవితాలతో చెలగాటమాడి ఇప్పుడు నీతులు చెబుతారా?**

**డీఎస్సీని అడ్డుకునేందుకు 300 కోర్టు కేసులు వేసిన చరిత్ర వైకాపాదే - దమ్ముంటే చర్చకు రండి.. ప్రతి అంశానికి ఆధారాలతో సమాధానం చెబుతాం**

**అమరావతి/సచివాలయం, ఆగస్ట్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ పేరుతో ఆశలు చూపి, చివరకు వారిని నట్టేట ముంచిన వైకాపాకు, నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఇప్పుడు డీఎస్సీ నియామకాలపై మాట్లాడే కనీస నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనమండలిలో డీఎస్సీపై చర్చ సందర్భంగా బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలకు మంత్రి అచ్చెన్నాయుడు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి నిరుద్యోగ యువతకు ఒక్క మెగా డీఎస్సీ కూడా ఇవ్వలేకపోయిన బొత్స సత్యనారాయణ ఈరోజు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ నీతులు మాట్లాడటం సిగ్గుచేటు. ఐదేళ్లు యువత జీవితాలతో ఆడుకున్న మీరా ఇప్పుడు నిరుద్యోగుల గురించి మాట్లాడేది? అని నిలదీశారు. 2019 నుంచి 2024 వరకు వైకాపా అధికారంలో ఉండి మెగా డీఎస్సీ ఇస్తామని నిరుద్యోగ యువతకు ఆశలు కల్పించిందని, ఆ ప్రకటనలను నమ్మి వేలాది మంది యువత అప్పులు చేసి మరీ శిక్షణ తీసుకుని, ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు చదివారని మంత్రి పేర్కొన్నారు. చివరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా వారి ఆశలను అడియాసలు చేసి, భవిష్యత్తుతో చెలగాటమాడారని మండిపడ్డారు. నాటి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన బొత్స సత్యనారాయణ ఈ వైఫల్యానికి సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు



చేయాల్సింది చేయకుండా, ఇప్పుడు పెద్దల సభలో నిలబడి డీఎస్సీపై ప్రశ్నలు సంధించడం రాజకీయ ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, నిరుద్యోగ యువతకు సకాలంలో ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపడితే దానిని కూడా అడ్డుకునేందుకు వైకాపా ప్రయత్నించిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు ఏకంగా 300 కోర్టు కేసులు వేసిన దుర్మార్గపు వైఖరి వైకాపాదేనని మండిపడ్డారు. కోర్టుల చేత చీవాట్లు తిన్నా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని, అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసి, తాము ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొస్తే కోర్టు కేసులతో అడ్డుకునేందుకు ప్రయత్నించడం నిరుద్యోగ యువత పట్ల వైకాపాకు ఉన్న చిత్తశుద్ధిని బయటపెడుతోందన్నారు. బొత్స సత్యనారాయణ .. డీఎస్సీపై చర్చకు మేము వెనక్కి తగ్గేది లేదు. శాసనమండలిలో ఏ సమయానికైనా, ఎన్ని రోజులైనా చర్చించేందుకు సిద్ధం. మీరు, మీ పార్టీ సభ్యులు లేవనెత్తే ప్రతి అంశానికి ఆధారాలతో సహా సమాధానం చెబుతాం. అంతేకాదు, మీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ విషయంలో ఏం చేశారు? నిరుద్యోగులకు ఇచ్చిన హామీలేమిటి? వాటిని ఎలా విస్మరించారు? అనే సమగ్ర వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను కూడా పంపిస్తాం. ముందు దాన్ని చదువుకుని సభకు రండి. ఆ తర్వాత ఎవరు నిరుద్యోగులను మోసం చేశారో, ఎవరు వారికి ఉద్యోగాలు కల్పించారో మండలి వేదికగానే తేల్చుకుందాం అని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. ఐదేళ్ల పాటు రాత్రింబవళ్లు కష్టపడి చదివి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను కించపరిచేలా వైకాపా నాయకులు మాట్లాడటం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగాలు సాధించిన యువతను, వారి భవిష్యత్తును వివాదాల్లోకి లాగొద్దని హెచ్చరించారు. మీ ఐదేళ్ల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అసత్య ప్రచారాలతో యువతను మరోసారి మోసం చేయాలని చూడొద్దు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోండి. డీఎస్సీ విషయంలో ఎవరి చిత్తశుద్ధి ఏమిటో, ఎవరి పాలనలో యువతకు ద్రోహం జరిగిందో ఆధారాలతో సహా సభలోనే తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దమ్ముంటే చర్చకు రండి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## చిన్నమ్మకు జాతీయ పదవి.. బీజేపీ స్పష్టమైన సంకేతాలు!

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ముందు బీజేపీ జాతీయ కార్యవర్గాన్ని ప్రక్షాళించారు. కొత్తగా 13 మందికి జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఇందులో ఏపీ నుంచి రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి స్థానం సంపాదించారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నేత, ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు రాంమాధవ్ సైతం ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇదేసమయంలో బీజేపీ జాయింట్ కోఆర్డినేటర్ గా విష్ణువర్ధన్ రెడ్డిని నియమించారు. ఇలా ఏపీ నుంచి మొత్తం ముగ్గురిని బీజేపీ జాతీయ కార్యవర్గంలోకి తీసుకోగా, తెలంగాణకు చెందిన పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ ను పదవుల నుంచి తప్పించారు. అంతేకాకుండా కొత్త జట్టులో తెలంగాణ నుంచి ఏ ఒక్కరికి అవకాశం కల్పించలేదు. దీంతో తెలంగాణ విషయంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని అంటున్నారు.

బీజేపీ జాతీయ కార్యవర్గాన్ని అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం ప్రకటించారు. కొత్త కార్యవర్గంలో మొత్తం 13 మంది ఉపాధ్యక్షులను నియమించారు. ఇందులో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేతోపాటు కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, సీనియర్ నేత రాంమాధవ్ ఉన్నా. ఇక బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మరో మాజీ మంత్రి స్మృతి ఇరానీకి బాధ్యతలు అప్పగించారు. పార్టీ కోశాధికారిగా పీయూష్ గోయల్, బీజేపీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీగా బీఎల్ సంతోష్ నియమితులయ్యారు. ఈయనను పార్టీ బాధ్యతల నుంచి విముక్తి కల్పిస్తారని ప్రచారం జరిగినా, అధిష్టానం మాత్రం ఆయనపై నమ్మకాన్ని కోల్పోలేదని తాజా నియామకంతో స్పష్టం చేసిందని చెబుతున్నారు.

### తెలంగాణకు దక్కని చోటు

బీజేపీ జాతీయ కార్యకర్గంలో తెలంగాణ నేతలకు పదవులు దక్కకపోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఏపీ నుంచి ముగ్గురికి పదవులిచ్చిన పార్టీ అధిష్టానం తెలంగాణ నుంచి ఒక్కరికి అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో ఇద్దరు కీలక నేతలను పదవుల నుంచి తప్పించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తేల్చుకోలేకపోతున్నట్లు పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అయితే పార్టీ పెద్దలు పక్కా ప్రణాళికతోనే జాతీయ కార్యవర్గాన్ని విస్తరించారని తెలంగాణ నేతలకు పదవులు ఇవ్వకపోవడం వెనుక ఇంకో కారణం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ పదవులు ఇవ్వలేదంటే ప్రభుత్వంలోకి తీసుకోబోతున్నట్లు సంకేతాలు ఇవ్వడమేనని అంటున్నారు.

### మంత్రివర్గంలోకి టీబీజేపీ నేతలు?

త్వరలో విస్తరించనున్న కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ బీజేపీ నేతలకు అవకాశం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా చేపట్టిన జాతీయ కార్యవర్గం విస్తరణలో ఈ మేరకు సంకేతాలు అందుతున్నాయని అంటున్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఏపీ నుంచి మరొకరికి బెర్తు దక్కుతుందని చాలాకాలంగా ప్రచారం జరుగుతుండగా, తెలంగాణలో ఆ చాన్స్ లేదన్న అభిప్రాయం వ్యక్తమైందని చెబుతున్నారు. అయితే తాజా నియామకాలతో ఈ పరిస్థితి మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ పదవుల నుంచి విముక్తి చేశారంటే ప్రభుత్వంలో అవకాశం కల్పించే ఆలోచన ఉండొచ్చని చెబుతున్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కచ్చితంగా గెలవాలని భావిస్తున్న బీజేపీ పెద్దలు రాష్ట్రానికి చెందిన నేతలకు ప్రజల్లో చొచ్చుకెళ్లేలా వాడుకోవాలని భావిస్తోందని అంటున్నారు. ప్రభుత్వంలో పదవులు ఉంటే ప్రజలతో మమేకయ్యే పరిస్థితి ఉంటుందనే ఆలోచనతోనే పార్టీ పదవుల నుంచి విముక్తి కల్పించినట్లు భావిస్తున్నారు. ఇక ఏపీలో మంత్రి పదవికి హాట్ ఫేవరెట్ గా భావించిన పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమించడంతో ఆమెకు మంత్రి అవకాశం లేనట్లు స్పష్టం చేసినట్లే అంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేసిన పురందేశ్వరికి మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే సంఘ్ నేపథ్యం లేకపోవడం వల్ల అప్పట్లో ఆమెకు అవకాశం ఇవ్వలేకపోయారని చెబుతున్నారు. ఆ తర్వాత లోక్ సభ డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారని జరిగిన ప్రచారం ఇప్పటివరకు వాస్తవరూపం దాల్చలేదని అంటున్నారు. మరోవైపు పురందేశ్వరిని తప్పించడంతో ఏపీ నుంచి ఇంకెవరికైనా కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఉంటుందా? లేదా? అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

### మరణ వాంగ్మూలం రాసి..

## గోదావరిలోకి దూకిన ఏఈ కుటుంబం



**రాజమహేంద్రవరం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నగరంలోని రోడ్డు కమ్ రైలు వంతెన పైనుంచి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిఠాపురానికి చెందిన ఏఈ కుటుంబం గోదావరిలోకి దూకింది. ఏఈ నూకరాజు, ఆయన భార్య, కుమార్తె, మనవడు నీటిలోకి దూకారు. మనవడు ప్రాణాలతో బయటపడగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మిగతా వారి కోసం పోలీసులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పిఠాపురంలో పంచాయతీరాజ్ ఏఈగా నూకరాజు పనిచేస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### మరణ వాంగ్మూలం రాసి..

నదిలోకి దూకేముందు నూకరాజు మరణ వాంగ్మూలం రాసి స్నేహితులు, అధికారుల గ్రూప్‌లో పోస్టు చేశారు. కాకినాడ రైఫిల్ షూటింగ్ ఆర్గనైజర్ షేక్ సాధిక్ ఖాన్ వేధింపుల కారణంగానే తమ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు నూకరాజు సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నారు. తన అల్లుడు ఈ ఏడాది జులైలో మరణించిన తర్వాత కుమార్తెను షేక్ సాధిక్ ఖాన్ వేధిస్తున్నాడని వెల్లడించారు. ఆ వ్యక్తి కారణంగా తన కుమార్తెకు, మనవడికి ప్రాణహాని ఉందని.. ఈ కారణంతోనే తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మరోవైపు పరారీలో ఉన్న సాధిక్‌ఖాన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు.

### నూకరాజు మృతదేహం లభ్యం

కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఏఈ కుటుంబం నివాసం ఉంటోంది. నిన్న కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి కారులో నూకరాజు కుటుంబం బయలుదేరింది. కొవ్వూరు వంతెన వద్ద డ్రైవర్‌ను దించి నూకరాజు కుటుంబం కారులో వెళ్లింది. రోడ్ కమ్ రైలు బ్రిడ్జిపై కారు ఆపి వంతెనపై నుంచి నూకరాజు కుటుంబం దూకింది. నీటిలో కొట్టుకువస్తున్న నూకరాజు మనవడు పదేళ్ల రియాన్ష్ కార్తికేయను జాలర్లు కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. గల్లంతైన నూకరాజు(61), భార్య మీనా(59), కుమార్తె సౌజన్య(34) కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ధోబీ ఘాట్ వద్ద నూకరాజు మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది.

### రిటైర్మెంట్ డబ్బుల కోసం

## భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య

**హుస్నాబాద్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక హనుమాన్ నగర్‌లో భర్తను భార్య హత్య చేసింది. భర్త వెంకటేశంను రోకలిబండతో భార్య రాజమణి కొట్టి చంపింది. ఆసిఫాబాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా వెంకటేశం పనిచేస్తున్నారు. సీనియర్ ఏఎన్ఎంగా భార్య విధులు నిర్వర్తిస్తోంది. ఈ నెలలో వెంకటేశం పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో రిటైర్మెంట్ డబ్బులు, ఆస్తి విషయంలో దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ గొడవ పెద్దదిగా మారింది. దీంతో భర్తను భార్య కొట్టి చంపింది. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పోలీసుల కారులో గంజాయి

### ఆటోను ఢీకొట్టడంతో స్థానికుల ఆందోళన

### అది నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సరకే: పోలీసులు

**అద్దంకి, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదానికి కారణమైన పోలీసుల కారులో గంజాయి ఉండటం కలకలం రేపింది. ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం శంఖవరప్పాడు వద్ద ఓ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సహా ఇద్దరు గాయపడ్డారు. కారులో సంతమాగులూరు, బల్లికురవ ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, నాగరాజు ఉన్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న బాధితుల బంధువులు, స్థానికులు అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కారు డిక్కీలో మద్యం సీసాలు, గంజాయి సంచులున్నాయంటూ కారును అడ్డుకున్నారు. ఈ ఘటనపై దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ విలేకర్లతో మాట్లాడారు. 'దొంగతనాలపై దర్యాప్తులో భాగంగా అద్దంకి మండలం ధర్మవరం ప్రాంతానికి పోలీసులు ప్రైవేటు వాహనంలో వెళ్లారు. నిందితుణ్ని వెంబడించినప్పుడు తన వద్దనున్న సంచిని వదిలి పరారయ్యాడు. పోలీసులు అందులో గంజాయి ప్యాకెట్లు, బీరు సీసాలున్నట్లు గుర్తించి, కారులో తీసుకొస్తున్నారు. అప్పుడే శంఖవరప్పాడు వద్ద ప్రమాదం జరిగింది. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో సంతమాగులూరు ఎస్సై ఫిర్యాదు చేశారు' అని డీఎస్పీ తెలిపారు.

### ఫోన్ ఛార్జింగ్ పెడుతుండగా

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



**కేటీదొడ్డి, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన హనుమంతు(28) కూలి పని చేస్తుంటారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డుకు ఫోన్ ఛార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. స్విచ్ బోర్డు ప్రమాదకరంగా ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. హనుమంతుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు (కవలలు) ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న భర్తను కోల్పోవడంతో భార్య కవిత కన్నీరుమున్నీరుగా విలపించారు.



విశ్వంవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




మంగళవారం, 18 ఆగస్టు, 2026

www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత
www.viswamvoice.com

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**కాకినాడ రూరల్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ టీడీపీ ఇన్ ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతీ ఇంటికీ చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు, విశాఖపట్నం పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక అంశాల్లో వేగంగా ముందడుగు వేస్తోందని వారు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజానుకూల నిర్ణయాలను, సంక్షేమ


పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ

పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఎప్పటికప్పుడు గ్రామాల్లో నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను, వినతులను ఆలకిస్తున్నామని తెలిపారు. ప్రజల అభియోగాలను, సమస్యలను సమీకరించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత 22 రోజులుగా సాగుతున్న ఈ "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు చూపుతున్న ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందనడానికి ఈ అనుకూల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అహోరాత్రులు శ్రమిస్తూ, ప్రభుత్వ విజన్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్న టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో కాకినాడ రూరల్, కరప మండలాల్లో సుమారు 45 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిద్రమత్తు వద్దు.. అప్రమత్తతే ముద్దు : 'స్టాప్-వాష్ అండ్ గో'తో ప్రమాదాల నివారణ

**సామర్లకోట, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నివారణ, ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్రైవర్లకు నిద్రమత్తు కారణంగా జరిగే ప్రమాదాలను అరికట్టే లక్ష్యంతో కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'స్టాప్--వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సామర్లకోట సీఐ శ్రీ ఏ. కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గత రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాత్రి వేళలు, తెల్లవారుజామున సుదీర్ఘ ప్రయాణాలు చేసే డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నిద్రమత్తుగా ఉన్న సమయంలో వాహనాలు



నడపకుండా సురక్షిత ప్రదేశంలో వాహనాన్ని నిలిపి కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని పోలీసులు సూచించారు. ముఖం కడుక్కొని పూర్తిగా అప్రమత్తమైన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని డ్రైవర్లకు తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వాహనాలు నడిపితే తమ ప్రాణాలతో పాటు ఇతర ప్రయాణికుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని పోలీసులు తెలిపారు. 'స్టాప్-వాష్ అండ్ గో' కార్యక్రమం డ్రైవర్లను ఇబ్బంది పెట్టేందుకు కాదని, నిద్రమత్తు కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడటమే ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు పేర్కొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతుకు రక్షణ : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ సూచనల మేరకు, వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంబించేలా రైతాంగాన్ని చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సమావేశ హాలు నందు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఇతర వ్యవసాయ శాఖ అధికారులతో కలసి ప్రత్యా మ్నాయ పంటల సాగుకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. ఈ ఏడాది ఎల్- నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, వర్షాలుఆలస్యం కావడం మరియు జలాశ యాల్లో నీటి నిల్వలు క్షీణించి నందున ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండేప్రత్యామ్నాయ పంటలను ఎంచు కోవడం ఉత్తమమన్నారు పిఎండిఎస్ (నిరంతర హరిత సాగు) విధానం ద్వారా 365 రోజులు భూమి నిరంత రం పచ్చని పంటలతో కప్పబడి ఉండేలా ప్రణాళికా బద్ధంగా సాగు చేయాలన్నారు.దీనివల్ల నీటి వినియోగసామర్థ్యంపెరుగుతుందన్నారు.కలుపు మొక్కల సమస్య తగ్గి, రైతుకు ఏడాదంతా నిరంతర ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి తోటలు మరియు పండ్ల తోటలలో మిశ్ర మ పంటల సాగు విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు.ప్రత్యా మ్నాయ పంటల ఎంపిక చేసుకుని వరి స్థానం లో పెసర,మినుము,కందులు,శనగ, అలసందలు, ఉలవలు వంటి పప్పు ధాన్యాల సాగు చేపట్టాలన్నారు. వీటికి నీటి అవసరం చాలా తక్కువ గా ఉండటమే కాకుండా 60 నుండి 90



రోజులలోకోతకువస్తాయన్నారు. నేలలో నత్రజని శాతం పెరిగి భూమి సారవంతమవుతుంది.చిరుధాన్యాలు నూనెగింజల సాగు ద్వారా వర్షా భావ పరిస్థితులను సమర్థవంతం గా ఎదుర్కోవచ్చునన్నారు. 2026 ఖరీఫ్ సీజన్ లో రైతులకు సాగు భద్రత కల్పించేందుకు బీమా ప్రీమియం మరియు పరిహార వివరాలు తెలుపుతూ వరి పంటకు ఎకరాకు రూ.760 ప్రీమియం చెల్లించాలని. పంట నష్టం వాటిల్లితే గరిష్టంగా రూ. 38,000 పరిహారం లభిస్తుం దన్నారు.ప్రతి పంటకు ఎకరాకు రూ. 2,000 ప్రీమియం చెల్లిం చాలని పంట నష్టం వాటిల్లితే గరిష్టంగా రూ. 40,000 పరి హారం లభిస్తుందన్నారు.పంటల మార్పిడి వల్లనీటి పొదుపు మరియు విద్యుత్ వినియోగంలో తగ్గింపు,ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గి పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు.నేల ఆరోగ్యం మెరుగు పడటం, పర్యావరణ పరిరక్షణ,రైతులకు స్థిరమైన మరియు నిరంతర ఆదాయ లభ్యత ఉంటుందన్నారు.రైతులు వర్షాల కోసం ఎదురుచూడ కుండా నీటి లభ్యతను బట్టి తక్కువ వ్యవధిలో పూర్తయ్యే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రతి నీటి బొట్టునూ పొదుపుగా వాడు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

# 70వ అవతరణ దినోత్సవ వేడుకలు, మెగావైద్య శిబిరం

**రెపరెపలాడిన యూనియన్ పతాకం**

**కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో 125 మంది వర్కింగ్ జర్నలిస్టులకు 2ఙ ఎకో గుండె పరీక్షలు**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 70వ అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వైజంక్షన్ ఆనం రోటరీ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే జెండాను ఆవిష్కరించారు. కిమ్స్ బొల్లినేని సహకారంతో నిర్వహించిన ప్రత్యేక గుండె పరీక్షల వైద్య శిబిరాన్ని పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పంతం కొండలరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర టిడిపి అధ్యక్షులు మజ్జి రాంబాబు ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో తూర్పుగోదావరి జిల్లా వర్కింగ్ జర్నలిస్టులకు ఈసీజీ మరియు టూ డీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్డియాలజిస్టులు డాక్టర్ బి అనూహ్య విద్యా దేవి, డాక్టర్ వై చైతన్యశ్రీ పర్యవేక్షణలో సుమారు 125 మంది పాత్రికేయులు ఉచిత వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఆ రిపోర్టులు ఆధారంగా కిమ్స్ కార్డియాలజిస్టులు సూచనలు ఇచ్చారు. ఉదయం నుంచి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కమిటీ అధ్యక్షులు మండెల శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పంతం సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు, జిల్లా టిడిపి కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు, బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నేత గన్ని కృష్ణ తదితరులు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనిశుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు మానికొండ చలపతిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. వైద్య శిబిరాన్ని కిమ్స్ బొల్లినేని సీఈఓ రామ్మోహన్ రావు, జీఎం కృష్ణ శ్రీ స్వయంగా పర్యవేక్షించారు. టిడిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్ వైద్య శిబిరం ముగింపులో పాల్గొన్నారు. పాత్రికేయులకు ఆరోగ్య సేవా కార్యక్రమాల నిర్వహణలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కిమ్స్ న్యూట్రిషనిస్ట్ షహీదా పాత్రికేయులకు రోజువారి ఆహార నియమాలపై విలువైన సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఎస్టీవీ శ్రీనివాస్, సిసిసీ గోపాలకృష్ణ, కెమెరామెన్ మురళీకృష్ణ , రాజానగరం వెంకటరమణ తదితరులను డాక్టర్ గోరంట్ల సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుడిపూడి పార్థసారథి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రాజా, విశ్వనాథ్ అయ్యప్ప స్వామి, ప్రసాద్, గణేష్ తదితర సభ్యులు పాల్గొన్నారు. శిబిరానికి రాజమండ్రి సిటీ సహా జిల్లా నుంచి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పాత్రికేయులు హాజరయ్యారు.

# కడలి ఆదిలక్ష్మికి విశిష్ట సేవా అవార్డు



**మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా ప్రధానం**

**రాజమహేంద్రవరం, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** వైద్య, ఆరోగ్య శాఖలో సీతానగరం పిహెచ్‌ఎన్‌గా సేవలందిస్తున్న కడలి ఆదిలక్ష్మికి విశిష్ట సేవా అవార్డు అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోమల, తదితర ఉన్నతాధికారుల చేతులమీదుగా ఆమె ఈ విశిష్ట సేవా అవార్డును అందుకున్నారు. 2025-26 సంవత్సరంలో ఆమె అందించిన సేవలకు గాను ఈ అవార్డును దక్కించుకున్నారు. ఆమె ఇప్పటివరకు ధవళేశ్వరం పిహెచ్‌సితో పాటు ఐసిడిఎస్ శాఖ, రాజమండ్రి జిల్లా ప్రభుత్వాసుపత్రి పిపి యూనిట్లోనూ సేవలందించారు. ప్రస్తుతం సీతానగరంలో పి హెచ్‌ఎన్‌గా పనిచేస్తు ఈ ప్రశంస అందుకున్నారు. ఆమెను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కోమల, ఇతర అధికారులు, ఆమె గతంలో పనిచేసిన పీహెచ్సీలు ప్రభుత్వాసుపత్రి పీపీ యూనిట్ అధికారులు, సిబ్బంది అభినందించారు. కడలి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, మరింత మంచి సేవలు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

# చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘన సత్కారం



**రాయవరం, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరం గ్రామంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన 39 మంది విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ పాలింగి చిన్నబాబు, యువ నాయకుడు బక్కి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.ఎస్.ఎన్. రెడ్డి, పారిశ్రామికవేత్త తేతలి సుబ్బిరామిరెడ్డి, డాక్టర్ టీ. నవీన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల్లో నిజమెంత..! అబద్ధం ఎంతో తెలుసా..!

**ముసుగేమో సైబర్ నేరగాళ్ళది ! దోపిడి కార్పొరేట్ సైబర్ నేర సంస్థలదా..! - బ్యాంకింగ్ సేవలు సైతం ఖాతా దారులను దోచుకునే విధంగానే వుంటున్నాయి : మేడా**

**రాజమహేంద్రవరం, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** బ్యాంకుల్లో పొదుపు సామాన్యులకు మేలు జరుగుతున్నట్టా ! ఆర్థిక ప్రమాదాన్ని కొనుక్కుంటునట్టా! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేసారు. ప్రస్తుతం సైబర్ నేరాలతో వ్యవస్థ అట్టుడికి పోతుంది . నేరాలు కట్టడి చేయటంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నాయి . సైబర్ నేరగాళ్లు నిజంగా ప్రభుత్వాలు కళ్ళు కప్పి నేరాలు చేస్తున్నారా ! 20% గా వున్న సైబర్ నేరాలు నేడు 95% గా పెరిగి పోతున్నాయి . ఇందుకు కారణాలు ప్రభుత్వ నేర సంస్థలు వైఫల్యమా ! ఆ ముసుగులో ప్రభుత్వాలను శాసిస్తున్న కొన్ని కార్పొరేట్ దిగ్గజ శక్తులు చేస్తున్న నేరాలా ! అనే అనుమానాలు రోజు రోజుకు బలపడుతున్నాయి . సైబర్ నేరాలు ఆగటం లేదు . ఈ నేరాలకు బలవుతున్న బాధితులకు న్యాయం చేసే తీరిక , బాధ్యత ఆ సత్తా మన భారత నేర పరిశోధన సంస్థలకు లేక పోతుందా ! నిజమైన సైబర్ నేరగాళ్ళ పాత్ర ఎంత మేరకు వుంటుంది . ఆ ముసుగులో కొన్ని కార్పొరేట్ సైబర్ నేర శక్తులు ఈ తరహా నేరాలు చేస్తు ప్రభుత్వాలకు , సమాజానికి ఛాలెంజ్ గా నిలుస్తున్నట్టు అనేక అనుమానాలు ప్రజలను వెంటాడుతున్నాయి . సైబర్ నేరాలకు



రోజు రోజు కు గురవుతున్న బాధితులు లక్షల్లో వుంటున్నారు . న్యాయం పొందుతున్న వాళ్ళు మాత్రం సంఖ్యల్లో కూడా ఉండటం లేదన్నారు . అలాంటి సైబర్ నేరాల బాధితుల్లో కూడా జె డి లక్ష్మీనారాయణ వంటి పెద్ద గుర్తింపు పొందిన వారు మాత్రమే ఉండటం విశేషం అని ఆయన అసహనం వ్యక్త పరిచారు. అత్యధిక శాతం సైబర్ నేరాలు సైబర్ నేరగాళ్ళ ఖాతాలోకి పోయేటట్టు కొన్ని బడా శక్తులు చేస్తున్నట్టుగానే ప్రస్తుత పరిస్థితులు వుంటున్నాయి . భారతదేశంలో వేల కోట్లల్లో సైబర్ నేరాలు జరుగుతున్నాయి . సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రభుత్వం కోట్లల్లో ప్రజాధనాన్ని వెచ్చిస్తుంది. ఎంత మేరకు సైబర్ నేరాల్లో దొంగిలించ బడ్డ సొమ్మును ప్రభుత్వ సంస్థలు రికవరీ చేసాయో చెప్పగలవా ! సామాన్యులు , నిరు పేదల నుండి దోచుకుంటున్న సొమ్ము నిజంగా నేరగాళ్ళ పనేనంటారా ! సైబర్ నేరాల ఫిర్యాదులు పట్టించుకునే స్థితి సాధారణ పోలీస్ నుండి ప్రత్యేక పోలీస్ వరకు ఎక్కడ లేకపోతుందన్నారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డివి రమణమూర్తి, ఎమ్ డి హుస్సేన్ , సిమ్మా దుర్గారావు, దుద్దే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, కారుమూరి యుగంధర్, కారుమూరి శిరీషా , మేడిచర్ల శ్రీనివాసరావు, సుంకర వెంకట భాస్కర రంగారావు , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా , చల్లా సాంబశివరావు, చల్లా అఖిల్, దోషి నిషాంత్ , లంక వీర వెంకట సత్యనారాయణ , కొల్లి సత్యనారాయణ , మట్టపర్తి తులసి, మోర్త ప్రభాకర్, ఏడిద బాబులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .



రామచంద్రాపురం ఆర్టీసీ నూతన డిపో మేనేజర్‌గా

# జి.ఎల్.ఎన్. మూర్తి బాధ్యతల స్వీకరణ



**రామచంద్రపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** భీమవరం డిపోలో గ్యారేజ్ మెకానికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తించిన జి.ఎల్.ఎన్. మూర్తి పదోన్నతిపై రామచంద్రాపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధుల్లో చేరిన డిపో మేనేజర్‌కు అధికారులు, సిబ్బంది మరియు వివిధ కార్మిక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిపో సీనియర్ అసిస్టెంట్ కె. రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.పట్టాభి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు బి.ముత్యాలరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వి.ఎల్. నారాయణ, గ్యారేజ్ విభాగం నుండి ఎన్.డి.వి.డి.వి. ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ఆఫీస్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ వి. రవీశ్వర్, అకౌంట్స్ విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణలతో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని నూతన డీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈనెల 20న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా



**5 కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు**

**రామచంద్రపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా జరుగుతున్న జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 20 న తేదీన ఉదయం 10:00 గంటల నుండి కెవిఆర్ హాస్పిటల్ దగ్గర గల ఉపాధి ఆఫీసులో 47వ జాబ్ మేళా నిర్వహింపబడుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 19 నుంచి 32 సంవత్సరాలలో టెన్త్, ఇంటర్ ,ఐటిఐ, డిప్లమా, డిగ్రీ ,బీటెక్, అభ్యర్థులకు శ్రీ సిటీ, కడప రేణిగుంట మేనకూరులో వివిధ పోస్టుల కొరకు డిక్సన్, హోల్డిక్సన్ ,ప్రీమియర్ ఎనర్జీ, నియోలింక్ ఎఫెక్ట్స్ , డైకిన్ కంపెనీ వంటి సుమారు 5 కంపెనీలలో ఉద్యోగాల కొరకు జాబ్ మేళా నిర్వహించ బడును. ఎంపికైన అభ్యర్థులకు 13000 నుంచి 23 వేల జీతం లభించును. అలాగే పిఎఫ్ ,ఈఎస్ఐ ,భోజన, వసతి, రవాణా, సదుపాయము ఆ కంపెనీలు ఆధారంగా లభించును. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు. మిగిలిన వివరములకు 7075704852 7075904852 నెంబర్లను సంప్రదించగలరు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు

# రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక



**రామచంద్రపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి. చంద్రకళ పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్ మీట్‌లో హైజంప్ విభాగంలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచి ఈ ఘనత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాల పేరును జాతీయ స్థాయిలో నిలిపేలా మరింత కృషి చేసి ఉన్నత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ పి. నూకరాజు విద్యార్థులకు ప్రతిరోజూ ఇస్తున్న అత్యుత్తమ శిక్షణ వల్లే ఈ విజయం సాధ్యమైందని, విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన చంద్రకళను ఫిజికల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ టి. శ్రీనివాస్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎన్.వి. రమణలతో పాటు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

అమలాపురంలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే

# 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అమలాపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మండేల నాగ వెంకట ప్రసాద్ (బాబి) అధ్యక్షతన ప్రెస్ క్లబ్ మీటింగ్ హాల్‌లో ఆవిర్భావ దినోత్సవ సమావేశం జరిగింది. పట్టణ సీఐ వీరబాబు ముఖ్య అతిథిగా హాజరై యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ చేస్తున్న కృషిని అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలతో పాటు సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.ఎన్.వి. ప్రసాద్ (బాబి) మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిర్వహించిన పోరాటాలను వివరించారు. జాతీయ స్థాయిలో ఐజేయూకు అనుబంధంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించామని తెలిపారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీయూడబ్ల్యూజే కృషి చేస్తోందన్నారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యులు ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం ప్రెస్ క్లబ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎర్ర వంతెన, నల్ల వంతెనల మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.ఎన్.వి. ప్రసాద్ (బాబి) యూనియన్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ సభ్యుడు పరసా సుబ్బారావు, జిల్లా కోశాధికారి ఎం.వి. అబ్బాస్, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు సుంకర ప్రసాద్, రంకిరెడ్డి కృష్ణ, పిల్లి శేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు అరిగెల రుద్ర శ్రీనివాస్, సభ్యులు ఆకుల రవితేజ, పొట్టుపోతు నాగు, రంబాల నాగ సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, దొమ్మేటి వెంకట్, జి. ప్రకాష్, ఆసు భరత్, పి. ఈశ్వరరావు, ఎస్. మురళి, కుడిపూడి గణపతి, కానుబోయిన దుర్గ ప్రసాద్, చొల్లంగి ప్రసాద్, కదలి సాయి, గుర్రం బాబ్జి, కట్టా మురళి, కె. బుజ్జి, మట్టపర్తి రమేష్, ఎం. నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి తిరిగి రాని మత్స్యకారుల బోటు

## మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం ముమ్మర గాలింపు : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం వోడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన మత్స్యకార బోటు చేపల వేటకు వెళ్లి నిర్ణీత గడువులోగా తిరిగి రాకపోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ బోటు ఆగస్టు 3న చేపల వేటకు బయలుదేరగా, ఆగస్టు 13న తిరిగి రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు వోడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చేరుకోలేదు. బోటులో సుమారు 15 రోజులకు సరిపడా రేషన్, 1,000 లీటర్ల డీజిల్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోటు విశాఖపట్నం, పారాదీప్ తీర ప్రాంతాల వైపు చేపల వేటకు వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బోటులో యజమాని, డ్రైవర్ కోపనాతి రామకృష్ణ వర్మతో పాటు మొత్తం ఎనిమిది మంది మత్స్యకారులు ఉన్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బోటులోని మత్స్యకారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ఇండియన్ కోస్ట్‌గార్డ్‌కు తక్షణమే సమాచారం అందించి, గాలింపు, రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన సమన్వయం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో సమన్వయం చేసుకుని, సంబంధిత పోలీసు యంత్రాంగం ద్వారా బోటు యజమాని, కుటుంబ సభ్యులు, ఇతర మత్స్యకారుల నుంచి అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, కోస్ట్‌గార్డ్‌తో పాటు ఇతర సంబంధిత రక్షణ సంస్థలకు అందించాలని కలెక్టర్ సూచించారు. బోటు ఆచూకీ, మత్స్యకారుల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, లభించే సమాచారాన్ని వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి భద్రత కోసం చేపడుతున్న చర్యలపై ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, సంబంధిత శాఖలు, ఇండియన్ కోస్ట్‌గార్డ్, పోలీసు యంత్రాంగం సమన్వయంతో బోటు ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు

# స్కాలర్‌షిప్‌లు అందజేసిన ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ సూచించారు. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకుండా వారికి అండగా నిలుస్తూ విద్యాభ్యాసానికి సహకారం అందిస్తున్న క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థల సేవలను ఆయన అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థల సహకారంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు డి. శ్వేత, డి. రేవతి, ఎన్. యశ్వంత్, పి. కీర్తి, కె. అమిత, ఏ. విజయదుర్గ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలో విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యలో రాణించాలని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారకుండా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అందుతున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి, మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి. వెంకట రమణ, ఏరియా మేనేజర్ షేక్ జమీర్ బాషా, మేనేజర్లు ఎం. చిన్న, వై. పోలినాయుడు, టి. లోవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసానికి తమవంతు సహకారం అందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

హైస్కూల్ నిర్మాణానికి

# శంకుస్థాపన చేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్

**బట్లపాలిక హైస్కూల్ అభివృద్ధికి దాతల ముందడుగు**

**భవన నిర్మాణానికి, వంట షెడ్డు ఏర్పాటుకు వాసంశెట్టి సత్యం హామీ - పాఠశాలకు కంప్యూటర్ అందజేత**



**కె.గంగవరం, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యాభివృద్ధికి సమాజం భాగస్వామ్యం కావాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కె.గంగవరం మండలం బట్లపాలిక గ్రామ హైస్కూల్ భవన నిర్మాణ పనులకు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. నిధుల కొరత కారణంగా మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తనతో పాటు, పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి సహకరించేందుకు దాత నిడదవోలు మాణిక్యాల రాజు హామీ ఇవ్వగా, భవనం పై అంతస్తు నిర్మాణ బాధ్యతను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరఫున తానే చేపడతానని వాసంశెట్టి సత్యం ప్రకటించారు. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగంగా, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అత్యంత అవసరమైన వంట షెడ్డు నిర్మాణాన్ని రెండు రోజుల్లో ప్రారంభిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన పలువురు దాతలు కూడా సుమారు రూ.2 లక్షల వరకు విరాళాలు ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన దాత నిడదవోలు సుబ్బరాజు పాఠశాలకు సమకూర్చిన కంప్యూటర్‌ను వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చేరువ కావాలంటే కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి మరికొందరు దాతలు కూడా తమ వంతు సహకారాన్ని ప్రకటించటం అభినందనీయమన్నారు. నీటి సంఘం అధ్యక్షులు గోపు సతీష్ విద్యార్థుల కోసం సైకిల్ షెడ్ నిర్మాణానికి హామీ ఇవ్వగా, బ్రహ్మపురి సొసైటీ అధ్యక్షులు గడ్డం బన్నీ పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూరుస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, కోలంక డీసీసీబీ డైరెక్టర్ విజయరాజు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, సూరవరపు వెంకట రాజు,బ్రహ్మపురి సొసైటీ అధ్యక్షులు గడ్డం బన్నీ, నీటి సంఘం అధ్యక్షులు గోపు సతీష్, కుడుపూరు సొసైటీ అధ్యక్షులు పత్తి సూరిబాబు, మసకపల్లి ఎంపీటీసీ సభ్యులు కొండేపూడి భవానీ అప్పారావు, కాటే సుబ్రహ్మణ్యం, రవ్వా భూషణం, పర్తంశెట్టి గోవిందు, పెదలంక సర్పంచ్, మేక రామయ్య చౌదరి, తోరం సత్యనారాయణ, కాటే సంజీవి, చోడి శివకేశ్వరరావు, అర్థంశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సింగంపల్లి స్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కూటమి నాయకులు



**కరప, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామంలో సింగంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన యువనేత స్వామికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు పుట్టినరోజుని పురస్కరించుకుని యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్నేహితునిపై ఉన్న అభిమానాన్ని ప్రేమను స్వతంత్ర దినోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహించి సుమారు 25 మంది యువత రక్తదానం చేసి అటు దేశభక్తిని మరియు స్నేహితులపై ఉన్న అభిమానాన్ని ఘనంగా చాటారు అదేవిధంగా సింగంపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట రామకృష్ణ మాట్లాడుతూ యువత పార్టీలు పబ్బులు కాకుండా ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొని ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి రక్తదానం చేయడం మంచి సందేశం అని అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అనే ఉద్దేశంతో మంచి సందేశం ఇవ్వడం చాలా సంతోషమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అభయ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు చీపురుపల్లి జయంద్రబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, పెనుగుదురు పిఎసి డైరెక్టర్ సింగంపల్లి నాగేశ్వరావు, జనసేన పార్టీ ఎస్సీ సెల్ కరప మండల అధ్యక్షులు మెండు గోవిందు, వెలమ సంఘ నాయకులు ఎనిమిరెడ్డి వెంకటరమణ, మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానము

## రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానమని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్ట రేటు నందు జిల్లా స్థాయి పీజిఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,జిల్లా అధికారులతో కలసిజిల్లా కలెక్టర్ నిర్వహించారు. అర్జీలు స్వీకరణకు ముందుగా గతంలో పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలపై జిల్లాఅధికారులు తీసుకున్న చర్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీలు పరి ష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ప్రజలకు వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాముఖ్యత పై అవగాహన కల్పిం చాల్సిన అవసరం ఉం దన్నారు. ప్రజలు ఈ కాల్ కు సరైన స్పందన ఇవ్వడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యత మెరుగు పడుతుందని, ప్రజలు నుండి అందిన ప్రతి వినతి ని సంబంధిత శాఖలు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి,ధరఖాస్తు దారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలన్నారు.



అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. అర్జీదారులు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా,వారికి పూర్తి సంతృప్తి కలిగే విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే,దానికి గలకారణాలనులబ్దిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదని, ఎండార్స్మెంట్లు తప్పుగా నమోదు చేయడం వంటి అంశాలు పట్ల సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.మానవీయ కోణంలో ప్రతి సమస్య కు నిబంధనలకు లోబడి పరిష్కారాలు అందించా లన్నారు. ఫిర్యా దులపరిష్కారంలో అలసత్వం వహించ కుండా నిర్దేశిత గడువు లోపల సమస్యను పరిష్కరించాలన్నారు... పి జి ఆర్ ఎస్ లో వచ్చే ప్రతి ఫిర్యా దును క్షుణ్ణం గా పరిశీలించి తగు పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి సమస్యకు నాణ్యతతో సంతృప్తికరమైన పరి ష్కారమార్గాలుఅందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కారంలో జాప్యాలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి పరిష్కరిస్తూ వెంటనే రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. పిఠాపురం పట్టణ పరిధిలోని జగ్గయ్య చెరువు నీరు కలుషి తం కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కోర్టు కేసులకు సంబంధించి ఒకాలత్‌ను వెంటనే ఫైల్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్వామా, డిపిఓ, పంచాయతీరాజ్ శాఖలలో కొత్తగా కేసులు వచ్చాయని వాటికి కూడా ఒకాలత్తులు సమర్పించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తోపాటు జేసి, డిడి ఓ.వాసుదేవరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస రావు,స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు నోడల్ అధికారి జె వేణు గోపాల్, అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తది తరులు పాల్గొన్నారు.

# తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకోవాలి

## అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే యనమల దివ్య ప్రస్తావన



**కోటనందూరు, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న తుని నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు.ఎలినో ప్రభావంతో రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న వర్షాభావ పరిస్థితులపై అసెంబ్లీలో తుని నియోజవర్గ రైతాంగం పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళిన ఆమె నియోజకవర్గంలో ప్రతి యేటా 32,260 ఎకరాల్లో వరి పంట సాగుఅవుతుంటే ఈఏడాది ఎలినో ప్రభావంతో 18వేల ఎకరాలపై ప్రభావం పడిందని ఈఖరీఫ్ ప్రశ్నార్ధకమైందని ఎమ్మెల్యే యనమల దివ్య ఆందోళన వెలిబుచ్చారు .అందుచేత తక్షణమే పంపా నుంచి ఆయుకట్టుకు నీటిని విడుదల చేయాలని కోరిన ఆమె పుష్కర ఎత్తిపోతల ద్వారా పంపా జలాశయానికి శాశ్వత ప్రాతిపదికను నీటిని అందివ్వాలన్నారు . వర్షాభావం వల్ల వరి నాట్లు వేసే పరిస్థితి కనిపించనందున ప్రత్యామ్నాయ ఉపాధి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ రైతులకు ఈ క్రాఫ్ట్ హాలిడే పిరిడ్ లో ఉపాధి కల్పించి వలసలు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.వర్షాలు లేనందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.పశుపోషణ కూడ భారమైందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళిన ఎమ్మెల్యే యనమల దివ్య పశువులకు నీటి సదుపాయం చూపించడంతో పాటు ఉచితంగా దాణా సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు . క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని పెంచాలని క్రాఫ్ట్ హాలిడే సమయంలో జీవన భృతికి ప్రత్యేక ప్యాకేజ్ అమలతో పాటు ఆయిల్ ఇంజన్లకు వాడే రబ్బర్ ట్యూబ్ ను ఉచితంగా అందించాలని కోరారు.ఇక తుని నియోజకవర్గ రైతాంగం ఆరుగాలం శ్రమించి సాగుచేస్తున్న పంటలను కోతులు సర్వనాశనం చేస్తున్నందున కోతుల బెడద నుంచి రైతాంగాన్ని గట్టెక్కించాలని యనమల దివ్య కోరారు.

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

## టిడిపి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు



**కాకినాడ రూరల్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలోని ప్రతి అర్హుడికీ సమర్థవంతంగా అందాలంటే ప్రజల భాగస్వామ్యం, మద్దతు ఎంతో అవసరమని మాజీ జడ్పీటీసీ తెలుగుదేశం నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు కూడా ఈ వికాసంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ?కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో “ఇంటింటికీ తెలుగుదేశం” ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో వైభవంగా సాగింది. కాకినాడ రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపైకి వచ్చి ఈ ప్రచారాన్ని ఎంతో వైభవంగా ముందుకు తీసుకెళ్లారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుతో కలిసి నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. గత రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయాలను, చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నివాసితులకు వివరంగా తెలియజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి వల్ల సామాన్య ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడమే కాకుండా, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ లు మిరపల సూర్య ప్రకాష్, మద్దూరి స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు జి సతీష్, యూనిట్ ఇంచార్జ్ లు మరివాడ ఆనందరావు, మండల కార్యదర్శి అయితిపూడి వీరబాబు, డి సత్యనారాయణ, మండల బీసీ సెల్ అధ్యక్షులు జామి సత్తిరాజు, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి ఈరెళ్ల రాజ్ కుమార్ పాల్గొని ప్రచారాన్ని ముందుకు నడిపారు. వారితో పాటు జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ముమ్మిడి బుజ్జి, నీటి సంఘం అధ్యక్షులు సింగం బాబ్జి, గ్రామ ఆర్గనైజింగ్ సెక్రటరీ యు శీను, కూటమి నాయకులు గొల్లపల్లి రాజా, పిల్లి వీరబాబు, పెండెం బాబ్జి, అరవ శివ, కొమిరిశెట్టి నరసింగరావు, ఎలగా లోవరాజు, కొండా వినాయక్, బొజ్జా సాంబశివరావు, పలివెల గాయత్రి, దొమ్మేటి వెంకటరమణ, సవరపు పెదపాపారావు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లూరులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## 15 మోటార్ సైకిళ్లు సీజ్ - గంజాయిపై అవగాహన కల్పించిన పోలీసులు



**తుని, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం తాళ్లూరు గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ, తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి, తుని టౌన్ ఎస్ఐ విజయ్‌బాబు ఆధ్వర్యంలో తుని రూరల్, తుని టౌన్, తొండంగి, కోటనందూరు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని, నిబంధనలు పాటించని 15 మోటార్ సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలకు నిబంధనల మేరకు జరిమానాలు విధించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే గంజాయి సరఫరా, అక్రమ నిల్వ, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే 1972కు ఫోన్ ద్వారా తెలియజేయాలని పోలీసులు కోరారు. నాటుసారా తయారీతో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చివరగా గ్రామస్తులతో పోలీసులు గంజాయికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

### చేపల మార్కెట్‌ను

# తక్షణం తొలగించాలి

## ఎమ్మెల్యే నానాజీకి వాకలపూడి గ్రామస్తుల వినతి





**కాకినాడ రూరల్, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకలపూడి గ్రామంలోని గంగాలమ్మ ఆలయం వద్ద రోడ్డు మార్జిన్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న చేపల మార్కెట్‌ను తక్షణం తొలగించాలని ఇంద్రప్రస్థ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక గ్రామస్తులు ఎమ్మెల్యే పంతం నానాజీని కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్, కార్యదర్శి శ్రీనివాస్, మనోజ్ మాట్లాడుతూ.. చేపల మార్కెట్ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్ పరిసరాల్లో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల వ్యాపారులు ఇప్పటికే కేటాయించిన మార్కెట్ యార్డుకు తరలేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడికి మార్కెట్‌ను తరలిస్తే ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విజ్జిబాబు, నరేష్, అపార్ట్మెంట్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు 292 అర్జీలు

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా స్పందించి, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్,జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్, డి ఆర్ ఓ డా.తిప్పేనాయక్, లతో పాటు డ్వామా పిడి మధుసూదన్, డిఆర్డీఏ పిడి జి.శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ,వార్డు అధికారి జె.వేణుగోపాల్, డీడీఓ పి.వాసుదేవర రావు, తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

### పేద ప్రజలు త్రాగు నీరు కోసం

# ఇబ్బంది పడకూడదు

## రాజా కులపతి షీబా సంస్థ డైరెక్టర్



**కోటనందూరు, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద ప్రజలు త్రాగునీరు కోసం ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో పేద,మధ్యతరగతి, దళితవాడ, సాంఘిక సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో త్రాగు నీరు కోసం చేతి పంపు బోర్లు ఏర్పాటు చేస్తున్నామని షీబా సంస్థ డైరెక్టర్ రాజా కులపతి అన్నారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం లో అల్లిపూడి బొద్దవరం గ్రామాలలో అమెరికాకు చెందిన వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ మైఖేల్ వైజర్ మరియు షీబా సంస్థ ఆధ్వర్యంలో త్రాగు నీటి బోర్లను ఏర్పాటు చేసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా షీబా సంస్థ డైరెక్టర్ రాజా కులపతి మాట్లాడుతూ నాసా సంస్థ మాజీ డైరెక్టర్ స్వర్గీయ ఎన్ సి హెచ్ ప్రేమదాసు ఈ ప్రాంతంలో పేద ప్రజల అభివృద్ధి కోసం సామాజిక చైతన్యం చేసి ఎందరికో సహాయ సహకారాలు అందించి పేద ప్రజల హృదయాలలో దేవుడయ్యాడని, ఆయన ఆశయాలు స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని అన్నారు. అమెరికాకు చెందిన మైఖేల్ వైజర్ మాట్లాడుతూ 26 సంవత్సరంల క్రితం దివంగత ప్రేమదాసు ఆహ్వానం మేరకు ఇండియాకు వచ్చి త్రాగునీరు కోసం బోర్లు వేస్తున్నామని, ఇప్పటివరకు 210 బోర్లు సుమారు కోటి 80 వేల రూపాయల తో నిర్మించామని దీనివల్ల పేద ప్రజలు త్రాగునీరుకి ఇబ్బంది లేకుండా ఉన్నారని తెలియజేస్తూ 16, 17 తేదీలలో బొద్దవరం, నాతవరం, పాల్తేరు, ఎన్ చామవరం, హంసవరం, తిమ్మాపురం, అల్లిపూడి, డి యర్రవరం, తుని, శంఖవరం ఏరియాలలో బోర్లు వేసి ప్రారంభించామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో అల్లిపూడి కేజీబీవీ ప్రిన్సిపాల్ జి రాజేశ్వరి, ఎస్సీ మాలా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె మరిడియ్య గ్రామ పెద్దలు నెమ్మాది సత్యనారాయణ, ఏ ప్రశాంత్ కుమార్,నాసా సిబ్బంది బి స్వర్ణలత, పి వెంకటరత్నం, రవి సురేంద్ర కుమార్, ఇందుగపల్లి సత్యనారాయణ, ఆరుగుల నాగేశ్వరరావు, అయినవిల్లి పెద్దాపురం, మోటకట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

### తుని, కోటనందూరులో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే

# 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కోటనందూరు, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 70వ ఆవిర్భావ దినోత్సవం కాకినాడ జిల్లా, తుని పట్టణం, కోటనందూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా స్థానిక జర్నలిస్టులందరూ కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, పత్రికా స్వేచ్ఛను కాపాడుతూ, ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడంలో జర్నలిస్టులు నిర్వర్తిస్తున్న పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. సమాజానికి నిజాలను అందించే ప్రయాణంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జర్నలిస్టులంతా కలిసి తుని తహశీల్దార్ కార్యాలయానికి, కోటనందూరు మండలానికి సంబంధించిన జర్నలిస్టులు కోట నుంచి తాహసిల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులకు తగిన సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఇళ్ల స్థలాలు మరియు గుర్తింపు కార్డుల సమస్యలను పరిష్కరించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో తుని ప్రాంతానికి చెందిన పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, కోటనందూరు మండలానికి చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మండల పాలకవర్గం చివరి సర్వసభ్య సమావేశం

## సమావేశాలకు పూర్తిస్థాయి సమాచారంతో రావాలి - అధికారులకు తెలియజేసిన ఎంపీడీవో



**కోటనందూరు, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** సమావేశాలకు వచ్చేటప్పుడు అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరవ్వాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ లగుడు శ్రీనివాస్ ఎంపీడీవో వెంకటనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీవో పి వెంకటనారాయణ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును చెప్పే క్రమంలో ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి అధికారుల వద్ద సమాచారం లేకపోవడంతో ఎంపీపీ వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమావేశాలకు వచ్చేటప్పుడు పూర్తిస్థాయి సమాచారంతో రావడం తెలియదా అంటూ నిలదీశారు. భీమవరపుకోటలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి త్రాగునీటి కుళాయిల ఏర్పాటు విషయంలోనూ ఉపాధి పనులు కల్పించడంలో వివక్షత చూపుతున్నారని ఎంపీటీసీ సభ్యులు కొత్తపల్లి మాణిక్యాలరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒక పార్టీ నాయకుల ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసిన వారు మరో పార్టీ నాయకులకు ఎందుకు ఏర్పాటు చేయలేదు అంటూ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను వి బి జి రాంజీ అధికారులను నిలదీశారు. దీంతో ఎంపీడీవో పి.వెంకటనారాయణ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పనులు ఇంకా పూర్తికాలేదని అందరికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని బదులిచ్చారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రాలను ఎప్పుడు పూర్తి చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల అంగన్వాడి కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సభ్యులు కోరారు. పశు వైద్యశాఖ అధికారి మాట్లాడితే వర్షాకాలం లో పశువులకు వచ్చే సిజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పశువులకు ఏమైనా ఇబ్బంది ఉంటే వెంటనే పశు వైద్య అధికారులను సంప్రదించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ కుక్క కాటు కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వర్షాకాలం దృష్టి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల వ్యాపార అభివృద్ధికి వెలుగులో అనేక లోన్ సౌకర్యాలు ఉన్నాయని అవి ఉపయోగించుకోవాలని ఏపీఎంపి సూర్యకుమారి సూచించారు. చివరిగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ 5 సంవత్సరాల కాలంలో ఎంపీపీగా కొనసాగడానికి అధికారులు ప్రజలు సహకరించారని కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ బి రాజు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, మండల శాఖ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి..

## డ్వాక్రా సభ్యులు సూపర్ నారీ యాప్ వినియోగించాలి : ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు



**కోటనందూరు, ఆగస్టు 17, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా బలాపేతం కావాలనే లక్ష్యంతో పనిచేయాలని ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. సోమవారం ముందుగా బొద్దవరం గ్రామంలో మన డబ్బులు.. మన లెక్కలు అనే కార్యక్రమం ఏపీఎం సూర్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతి డ్వాక్రా సభ్యురాలు కూడా సూపర్ నారీ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు మన డబ్బులు మన లెక్కలు తెలుసుకోవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాలు బలోపేతమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని. దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఎం సూర్యకుమారి ఎల్ సి రమేష్, సీసీలు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రియాంక హత్యపై అసెంబ్లీలో, మండలిలో చర్చ జరపాలి




- ★ నిష్పక్షపాతంగా కేసు విచారణ చేపట్టాలి..
- ★ 3వ తేదీ రాత్రి నుంచి నిందితుల సెల్ సిగ్నల్స్ ట్రేస్ చేయాలి..
- ★ తిలక్ రోడ్ ప్రాంతంలో ఉన్నట్టు స్పష్టమైన సమాచారం ఉంది..
- ★ ప్రకాశం నగర్ సిఐను ఇంకా ఎందుకు సస్పెండ్ చేయలేదు..
- ★ నిందితులను కాపాడుతున్న బడా బాబులెవరు?
- ★ ప్రియాంకు న్యాయం జరగాలన్నదే మా ఆకాంక్ష..
- ★ మరే యువతికి ఆ విధంగా జరగకూడదు..
- ★ నిందితులను కాపాడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి..
- ★ మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్

**రాజమహేంద్రవరం, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈ రాష్ట్ర ప్రభుత్వం తీరును చూస్తుంటే మెడికో ప్రియాంక హత్య కేసులో ఆ కుటుబానికి న్యాయం జరుగుతున్న నమ్మకం రాష్ట్ర ప్రజలకు, ఆ కుటుంబ సభ్యులకు, తమ పార్టీకి కనిపించడం లేదని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ వ్యాఖ్యానించారు. ఈ కేసుపై వెంటనే అసెంబ్లీలో, శాసన మండలిలో ప్రత్యేకంగా చర్చించి ఆ కుటుంబానికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. స్థానిక వివెల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో ఉన్న వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం ఆయన ఈ కేసుకు సంబంధించి సంచలన ఆరోపణలు చేసారు. ఈ కేసు నమోదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రకాశం నగర్ సిఐపై ఎందుకు చర్యలు తీసుకోలేదో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. 3వ తేదీ రాత్రి డిఎస్పీ హాలిడేలో ఉన్నారా? లేక సెలవులో ఉన్నారో ఈ కేసు విచారణకు ప్రత్యేకాధికారిగా నియమించిన పాటిల్ దేవరాజ్ స్పష్టత నివ్వాలన్నారు. ఆయన ఆన్ డ్యూటీలో ఉంటే సెకండ్ షో సినిమాకు ఎలా వెళ్లారో విచారణ చేయాల్సి ఉందన్నారు. నిష్పక్షపాతంగా ఈ కేసు విచారణ జరిగితేనే అన్ని వాస్తవాలు బయటపడతాయన్నారు. నిందితులు ప్రసాదిత్య మాల్‌లో 3వ తేదీన హత్య చేసి తప్పించుకుని పోయారని చెబుతున్నారని వారి సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆ రోజు తిలక్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టుగా తమకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. ఆ ఏరియాలో తెలుగుదేశం పార్టీ బడాబాబులు నివాసం ఉంటున్నారని వారికి ఎవరూ ఆశ్రయం కల్పించారో కూడా తెలిసిపోతుందన్నారు. నిందితులు దొరకకుండా 4వ తేదీన వారి సెల్‌ఫోన్లు సీజ్ చేసామని చెప్పడం కూడా విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిందితుల్ని పట్టుకుంటే 6వ తేదీ వరకు ఎందుకు అరెస్టు చూపించలేదని నిలదీసారు. ఈ సమయంలో ఎన్ని కేసులు ఎందరి చేతులు మారాయో అన్ని ఆధారాలతో సహా బయటపెడతామని హెచ్చరించారు. ఆడపిల్లపై ఆఘాయిత్యాలకు పాల్పడితే అదే చివరిరోజు అంటూ ప్రతీ మీటింగ్‌లోనూ చంద్రబాబు ఉదర కొడుతుంటారని, మరీ ఈ హత్య జరిగి 10 రోజులైనా కేసు విచారణలో ఎందుకు పురోగతి కనిపించడం లేదని ప్రశ్నించారు. డాక్టర్ ప్రియాంకు జరిగినట్టుగా ఇంక రాష్ట్రంలో ఎవరికి జరగకుండా చూడాలన్న విషయంలోనే వైసిసి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేసారు. ఆ నిందితులు, వారికి కొమ్ముకాసిన దుర్మార్గులు తప్పించుకుంటే ఇక నేరస్తులెవరికి ఎవరికి భయం ఉండదన్నారు. మైనర్ బాలికపై నగర శివార్లలో దారుణంగా అత్యాచారం చేసారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలు ఇక ఎప్పుడు ఆగుతాయని, నేరస్తుల ఆగడాలకు ఎప్పుడు అడ్డుకట్టవేస్తారని నిలదీసారు. ఈ కేసు విచారణ విషయంలో తాము పోరాటం చేస్తుంటే తమకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆరోపించారు. తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో అనుమానితులు సంచరిస్తున్నట్టుగా కూడా అనుమానం ఉందన్నారు. వారికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందచేస్తామని, తమను భయపెట్టాలని చూస్తున్న వారెవరో తేల్చాలని డిమాండ్ చేసారు.

# మండపేట పోస్ట్‌ఆఫీస్‌కు ఐదు అవార్డులు

## సిబ్బంది కృషితో డివిజన్‌లో ప్రథమ స్థానం



**మండపేట టౌన్, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రైవేటు కొరియర్లు, ఆన్‌లైన్ సేవల పోటీ మధ్య కూడా మండపేట సబ్ పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు అందించిన సేవలు డివిజన్ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజమండ్రిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో మండపేట పోస్ట్ ఆఫీస్‌కు దాదాపు 5 అవార్డులు దక్కాయి. పోస్టల్ సూపరింటెండెంట్ కోట శేషారావు అవార్డులు అందజేశారు. డివిజన్‌లో అత్యధిక తపాలా జీవిత బీమా పాలసీలు సాధించినందుకు పోస్టల్ అసిస్టెంట్ కె.వి. నారాయణరావు 2 అవార్డులు, సబ్ డివిజన్ స్థాయిలో కొండపల్లి సూర్యనారాయణ2 అవార్డులు అందుకున్నారు. అలాగే అకౌంట్స్ ఓపెనింగ్‌లో మండపేట పోస్ట్ ఆఫీస్ డివిజన్‌లో మొదటి స్థానం సాధించింది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాల ప్రచారంలో ఉద్యోగులు చూపిన చురుకుదనం వల్లే ఈ స్థాయి గుర్తింపు వచ్చిందని పోస్ట్ మాస్టర్ బి సీతా మహాలక్ష్మి తెలిపారు. సీనియర్ ఉద్యోగి ఎం డి ఎం షరీఫ్ మైక్ ప్రచారంతో పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొందిన కెవి నారాయణరావు, సూర్యనారాయణలను పట్టణ ప్రజలు, ఉద్యోగులు అభినందించారు.

### చిన్న కొండెపూడిలో

# ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**సీతానగరం, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన కొండెపూడి గ్రామం లో సోమవారం శ్రీ కోదండ రామ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చినకొండే పూడి గ్రామానికి చెందిన కోడే దుర్గారావు, ఆకుల రత్తయ్య దంపతులు చేతులమీ దుగా పూజా కార్యక్ర మాలు నిర్వ హించారు. ఈ శంకుస్థాపన కార్య క్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజ కవర్గం పరిశీలకు రాలు జక్కంపూడి విజ యలక్ష్మి పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో ఆలయ శంకుస్థాపన కా ర్యక్రమంలో పాల్గొన్నారు.

# మండపేటలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవం

## యూనియన్ జెండా ఆవిష్కరణ - జర్నలిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలి



**మండపేట టౌన్, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో సోమవారం ఏపీ యూ డబ్ల్యూ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపేట నియోజక వర్గం ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత తూర్పు గోదావరి జిల్లా ఏపీ యూ డబ్ల్యూ జె జిల్లా ఉపాధ్యక్షులు కోసూరి అప్పారావు మండపేట మండల అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో సంఘం పతకాన్ని ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ తేజేశ్వరరావు కు వినతి పత్రం అందజేశారు. ఆవిర్భావ దినోత్సవం వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షులు టపా రామకృష్ణ, యూనియన్ సీనియర్ నాయకులు యార్లగడ్డ ప్రసాద్, ఏపీయు డబ్ల్యూ జె జిల్లా కార్యదర్శి ఉండమట్ల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ లక్ష్మీ నారాయణ, ఐ జె యూ మాజీ సబ్యులు సయ్యద్ హుస్సేన్ లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 1957 ఆగస్ట్ 17 వ తేదీన ఆవిర్భవించిందన్నారు. 2026 ఆగస్ట్ 17 వ తేదీ నాటికి యూనియన్ ఆవిర్భవించి 69 ఏళ్ళు పూర్తి చేసుకుని 70 వ ఏట ప్రవేశిస్తున్నదనీ పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, వృత్తి ప్రమాణాల పెంపుదల, వర్కింగు జర్నలిస్టుల హక్కులు, జర్నలిస్టుల సంక్షేమం, జర్నలిస్టుల భద్రత గురించి గత 70 ఏళ్ళుగా ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, విభజిత ఆంధ్రప్రదేశ్ లోనూ ప్రస్తుతం జర్నలిస్టులు అనుభవిస్తున్న సదుపాయాలన్నీ యూనియన్ చొరవతో, కృషితో అమలులోకి వచ్చినవేనని పేర్కొన్నారు. 2026 ఆగస్ట్ 17 వ తేదీ నుండి ఏడాది పొడవునా ప్లాటినం జూబిలీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి యూనియన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదన్నారు. 2018-19 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలను, వారికి తగిన వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం డివిజన్ ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షులు టపా రామకృష్ణ, యూనియన్ సీనియర్ నాయకులు యార్లగడ్డ ప్రసాద్, ఐజెయూ మాజీ సబ్యులు సయ్యద్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షులు కోసూరి అప్పారావు , జిల్లా సహాయక కార్యదర్శి ఉండమట్ల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు చిల్లి లక్ష్మీ నారాయణ రాజు, యూనియన్ నాయకులు చీకరమెల్లి సతీష్, మట్టా ధనరాజు, పెనుమచ్చి బాబు సుకుమార్, కోటి రాజకుమార్, మేక వినోద్, పాదూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో కడియం భక్తుల నమోవెంకటేశం..

## ఒకే సారి వందమందికి దర్శన భాగ్యం



**తిరుమల, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** కనరే శ్రీనివాసుని వైభవం అంటూ తూర్పుగోదావరి జిల్లా కడియం మండలానికి చెందిన పలువురు భక్తులు తిరుమల తిరుపతిలో సోమ వారం సందడి చేశారు. ఆధ్యా త్మిక సేవలో పాల్గొన్నారు. మండలంలోని 14 గ్రామాల నుండి 100 మంది భక్తులు ఏకకాలంలో దర్శనం చేసుకున్నారు. మాధవరాయుడు పాలెం గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, దాత ,శ్రీ సాయినాథ్ నర్సరీ అధినేత సాధనాల బాబ్జీ పుట్టినరోజు సందర్భంగా ఆయన తనయుడు సాధనాల సత్య సాయినాథ్ (బాలు నాయుడు)ఆధ్యాత్మిక యాత్రకు పిలుపునిచ్చారు. తిరుపతిలో వసతి సౌకర్యాలతో పాటు శ్రీవారి దర్శనఏర్పాట్లు చేశారు. కడియం, వేమగిరి,కడియపులంక, దుళ్ళ, మురమండ, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, పొట్టిలంక, జేగురుపాడు, కడియపుసావరం, బుర్రిలంక, వెంకాయమ్మపేట తదితర గ్రామాలనుండి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖ నర్సరీ రైతులు,పాత్రికేయులు శ్రీవారి దర్శన భాగ్యం పొందారు. బృందంగా వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని కడియం మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, జనసేన అధ్యక్షులు ముద్రగడ జమ్మి అన్నారు. పలు దేవాలయాలు భూరి విరాళాలు ఇవ్వడంతో పాటు మానవ సేవే మాధవ సేవ అని నమ్మి 4 దశాబ్దాలు నిరంతరం ఎందరో రోగులకు వైద్య సహాయాలు,సూచనలు చేసిన ఆదర్శవాది బాబ్జీ అన్నారు..ఆయన ఆశయాలు పుణికి పుచ్చుకున్న బాలునాయుడు దేశంలోనే గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రం అయిన తిరుపతి లో పార్కు అభివృద్ధి కి భూరి విరాళం ప్రకటించడం పట్ల అభినందనలు తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో టిడిపి,జనసేన, వైసీపీ,బీజేపీ నాయకులు, నర్సరీ రైతులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# రోడ్లపై గోవుల గుంపులు

## పట్టించుకోని అధికారులు!





**రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రురల్ ధవళేశ్వరం గ్రామంలో గోవుల సంచారం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డుపై సుమారు 30కి పైగా గోవులు గుంపులు గుంపులుగా యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. రోడ్లపైనే కూర్చోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోవులు ఒక్కసారిగా వాహనాల ముందుకు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు గోవులు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వాహనదారులకే కాకుండా మూగజీవాల ప్రాణాలకు కూడా ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోడ్లపై గోవులు కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని చెబుతున్నారు. అలాగే వైరస్‌తో బాధపడుతున్నా పట్టించుకోని కొందరు గోవు యజమానులు కూడా ఉన్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతతో పాటు మూగజీవాల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న గోవులను నియంత్రించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

### నాగ పంచమి సందర్భంగా

# జక్కంపూడి ప్రత్యేక పూజలు



**కోరుకొండ, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గాడాల గ్రామంలో శ్రీమాత మానసదేవి అమ్మవారి ఆలయంలో నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్ఆర్సిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నాగపంచమి సందర్భంగా గాడాలలో మానసదేవిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో జక్కంపూడి లక్ష్మిని ఘనంగా సత్కరించారు. యావన్మంది భక్తులు ఉదయం నుండి అమ్మ వారిని దర్శించుకుని, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్య క్షుడు కొండపల్లి దుర్గారావు, పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయకమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పురందేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేసిన నీరుకొండ



**కోరుకొండ, ఆగస్టు 17, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరికి భారతీయ జనతా పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలుగా నియామకం కావడం పట్ల భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాజానగరం నియోజవర్గ మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఢిల్లీ నుంచి గల్లీ దాకా మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్రంలో బిజెపికి మంచి భవిష్యత్ ఉందన్నారు. దగ్గుపాటి పురందేశ్వరి నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజాగరం నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పురందేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వీరన్నచౌదరి అన్నారు.




సినీ వాయిస్ CINE VOICE

# ఓటీటీ రియాలిటీ షోకు హోస్ట్‌గా సమంత

### ప్రోమో వచ్చేసింది.. షో లాంచింగ్ ఎప్పుడంటే?



సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తాజాగా 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'ను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ కుకింగ్ ఫార్మాట్‌ను తమిళ ప్రేక్షకుల కోసం సోనీ విజా, సోనీ లివ్‌లో స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు హోస్ట్ చేస్తుండడం విశేషం. సెలబ్రిటీలు, ఫుడ్, కాంపిటీషన్.. ఈ మూడు ప్రపంచాలను ఒకే దగ్గరకి తీసుకొస్తూ 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రూపొందుతోంది. తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు తొలిసారి సెట్స్ నుంచి కిచెన్‌లోకి అడుగుపెట్టి.. కఠినమైన వంటలకు సంబంధించిన సవాళ్లు, ఊహించని ట్విస్టులు, ఒత్తిడిని ఎదుర్కోబోతున్నారు. ప్రేక్షకులను మెప్పించడంతో పాటు.. ప్రతి ఛాలెంజ్‌లో విజయం సాధించేలా రుచికరమైన వంటకాలను తయారు చేస్తూ తమ టాలెంట్‌ను నిరూపించుకోబోతున్నారు. బనిజె ఏషియా నిర్మిస్తోన్న 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మాస్టర్‌చెఫ్ ఫార్మాట్‌ను ఆధారంగా చేసుకుని రూపొందుతోంది. అయితే తమిళ నేటివిటీకి తగ్గట్టుగా లోకల్ ఫ్లేవర్స్, ప్రేక్షకులకు సుపరిచితమైన సెలబ్రిటీలు, తమిళ సెలబ్రిటీ కల్చర్‌లోని ప్రత్యేకమైన కెమిస్ట్రీకి ప్రాధాన్యతనిస్తూ ఈ షోను రూపొందిస్తున్నారు. 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' సోనీ విజాలో కీలకమైన ఎంటర్‌టైన్‌మెంట్ షోగా నిలవనుంది. అలాగే ఈ షో సోనీ లివ్‌తో పాటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ అందుబాటులోకి రానుంది. మెయిన్ ఎపిసోడ్స్‌కు మించి ప్రేక్షకులను మరింత ఎంగేజ్ చేసేలా ప్రత్యేకమైన షార్ట్ ఫార్మ్ కంటెంట్‌ను కూడా అందించనున్నారు. సెలబ్రిటీల కుకింగ్ జర్నీ, వారు ఎదుర్కొనే ఛాలెంజెస్, కిచెన్‌లో చోటుచేసుకునే ఆసక్తికరమైన, మరిచిపోలేని మూమెంట్స్‌ను ఈ ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ ద్వారా ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ "ఈ షోలో పాల్గొంటుండటం ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉంది. నేను ఇప్పటివరకు చేసిన వాటన్నింటికంటే 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అదే ఈ షోకు నేను నో చెప్పలేకపోవడానికి ప్రధాన కారణం. అందరినీ ఒకేచోటికి తీసుకురావడంలో, మధురమైన జ్ఞాపకాలను సృష్టించడంలో, సాధారణంగా కెమెరాల ముందు కనిపించని మనలోని మరో కోణాన్ని బయటపెట్టడంలో ఫుడ్‌కు ఓ ప్రత్యేకమైన శక్తి ఉంది. ముఖ్యంగా మనకు ఎంతో ఇష్టమైన తమిళ సెలబ్రిటీలు కిచెన్‌లోకి అడుగుపెట్టి, రిస్కులు తీసుకోవడం, తప్పులు చేయడం, తమను తామే సర్‌ప్రైజ్ చేసుకోవడం, మనం ఊహించిన దానికంటే ఎక్కువ ప్యాషన్‌తో పోటీపడటాన్ని చూడటానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఎవరు కిచెన్‌లో వంట చేయబోతున్నారో ఇప్పుడే చెప్పాలని నాకూ ఉంది.. కానీ అలా చెబితే అసలు ఫన్ ఏముంటుంది? సోనీ విజాతో కలిసి మేం ఏం వండబోతున్నామో అందరూ చూసి ఎంజాయ్ చేసే రోజు కోసం ఎదురుచూస్తున్నాను" అన్నారు. సమంత రూత్ ప్రభు హోస్ట్‌గా వ్యవహరిస్తూ..తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు కిచెన్‌లోకి అడుగుపెట్టనున్న 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'.. సెలబ్రిటీ కుకింగ్‌కు సరికొత్త వినోదాన్ని తీసుకురానుంది. ఫుడ్, ఫేమ్, కాంపిటీషన్‌తో పాటు తమిళ సంస్కృతిలోని ఆప్యాయతను ఒకే వేదికపైకి తీసుకొస్తూ.. ప్రేక్షకులకు సరికొత్త ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' త్వరలోనే సోనీ విజా, సోనీ లివ్‌లోకి రానుంది. డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లోనూ ఈ షోకు సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ అందుబాటులోకి రానుంది.

# హిట్టు కొట్టి 15 ఏళ్ళు.. అయినా తగ్గని క్రేజ్..!

### ఈ ముద్దుగుమ్మ వయ్యారానికి ఎవరైనా పడిపోవాల్సిందే..



చిత్రపరిశ్రమలో రాణించడం అంత సులభం కాదు.. వరుసగా సినిమాలు చేసి కనిపించకుండా పోయిన హీరోయిన్స్ ఉన్నారు. అలాగే ఏళ్ల తరబడి ఇండస్ట్రీలో రాణిస్తున్న ముద్దుగుమ్మలు కూడా ఉన్నారు. ఇక ఇండస్ట్రీలో హిట్స్, ఫ్లాప్స్ అనేవి చాలా కామన్. హీరోలు, హీరోయిన్స్ చాలా మంది హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. కొంతమంది మాత్రం ఫ్లాప్స్ వస్తే కనిపించకుండా పోతారు. సినిమాలు ఫ్లాప్ అయితే చాలు ఐరెన్ లెగ్ అని ముద్ర వేసేస్తారు. మెల్లమెల్లగా సినిమా అవకాశాలు కూడా తగ్గిపోతాయి.. క్రమంగా ఇండస్ట్రీలో కనిపించకుండా పోతారు.. కానీ ఈ హీరోయిన్ రూటే సపరేట్.. 15ఏళ్లుగా ఒక్క హిట్ అందుకోలేకపోయింది.. ఇరవై ఏళ్లకు పైగా సినీ ఇండస్ట్రీలో ఉంది ఈ ముద్దుగుమ్మ. అలాగే 15 ఏళ్లుగా హిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. కానీ ఆమె క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గలేదు. ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ క్రేజీ బ్యూటీ చిత్రాంగదా సింగ్. ఈ అమ్మడి గురుంచి అందరికి తెలిసిందే. అందేలా భామ చిత్రాంగదా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించి, అక్కడే పెరిగింది. బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యింది. 2005లో హజారోన్ ఖ్వైషీన్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను అని చెప్పుకొచ్చింది. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా కూడా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రకు కూడా నేను నో చెప్పా.. అని తెలిపింది. సినిమాలు నిరాశపరిచినప్పటికీ ఆమె నటనకు ఎప్పుడూ మంచి మార్కులే పడ్డాయి. కానీ కమర్షియల్‌గా పెద్ద హిట్స్ లేకపోవడం ఆమె కెరీర్‌కు మైనస్‌గా మారింది.

క్రీడా వాయిస్ మీ క్రీడా వార్తల స్వరము

# టీమిండియాపైనే తన తొలి సెంచరీ కొట్టాడు.. ఎవరీ సోనల్ దినూష?

టీమిండియాపై శ్రీలంక యువ ఆల్‌రౌండర్ సోనల్ దినూష తొలి టెస్టు సెంచరీ సాధించాడు. 168 బంతుల్లో 100 పరుగులు చేసి శ్రీలంకను కష్టాల నుంచి గట్టెక్కించాడు. 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన సమయంలో ధనంజయ డి సిల్వాతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఎడమచేతి బ్యాటర్, స్పిన్నర్‌గా దినూష శ్రీలంకకు భవిష్యత్తు ఆశాకిరణంగా మారుతున్నాడు. టీమిండియాతో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక యువ క్రికెటర్ సోనల్ దినూష సంచలన ప్రదర్శన చేశాడు. కెరీర్‌లో తొలి టెస్టు సెంచరీని భారత జట్టుపైనే సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. 168 బంతుల్లో 100 పరుగులు చేసిన దినూష.. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో నాలుగు గంటలకు పైగా క్రీజులో నిలిచాడు.

**90 పరుగులకే 5 వికెట్లు.. అక్కడి నుంచి అద్భుత పోరాటం**

భారత బౌలర్ల ధాటికి శ్రీలంక 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో ఉన్న సమయంలో దినూష క్రీజులోకి




వచ్చాడు. ధనంజయ డి సిల్వాతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇద్దరూ కలిసి కీలకమైన 146 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో శ్రీలంక భారీ కష్టాల నుంచి బయటపడి పోటీలో నిలిచింది. ధనంజయ డి సిల్వా ఔటైన తర్వాత కూడా దినూష తన పోరాటాన్ని కొనసాగించాడు. దిగువ వరుస బ్యాటర్లతో కలిసి పరుగులు సాధిస్తూ జట్టు స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. చివరకు రవీంద్ర జడేజా బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు.

**ఎవరీ సోనల్ దినూష?**

2000 డిసెంబర్ 4న కొలంబోలో జన్మించిన సోనల్ దినూష ఎడమచేతి వాటం బ్యాటర్, నెమ్మదైన ఎడమచేతి ఆర్థడాక్స్ స్పిన్నర్. మహానామ కళాశాలలో చదువుకున్న అతను శ్రీలంక వయో విభాగాల క్రికెట్ నుంచి అంచెలంచెలుగా ఎదిగాడు. అండర్-19, ఎమర్జింగ్, శ్రీలంక-ఏ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో కొలంబో క్రికెట్ క్లబ్, దంబుల్లా, గాలే టైటాన్స్, దంబుల్లా సిక్సర్స్, ఎస్ఎల్‌సీ గ్రీన్స్ వంటి జట్లకు ఆడాడు. బ్యాటింగ్‌తో పాటు స్పిన్ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతనికి అదనపు బలం.

**శ్రీలంక-ఏ జట్టులోనే సత్తా చాటాడు**

టెస్టు జట్టులోకి రాకముందే దినూష శ్రీలంక-ఏ తరఫున మంచి ప్రదర్శనలు చేశాడు. 2024 నవంబర్‌లో పాకిస్థాన్ షహీన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో అజేయంగా 116 పరుగులు సాధించాడు. పవన్ రత్నాయకేతో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు.

### గాలేలో టీమిండియా

# విజయాన్ని తేల్చే టార్గెట్ అదే..



శ్రీలంకతో జరుగుతూన్న తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం సాధించే దిశగా దూసుకుపోతోంది. అయితే, మూడో రోజు ముగిసిన తర్వాత 178 పరుగుల ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు లంక ముందు ఎంత టార్గెట్ ఉంచితే గెలుస్తారో తేలిపోయింది. ఆ లెక్కలు ఏంటో ఓసారి చూద్దాం..! శ్రీలంకతో జరుగుతోన్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల ఆధిక్యం సాధించింది. దీంతో ఈ మ్యాచ్ గెలిచే అవకాశాలు గణనీయంగా పెరిగాయి. అయితే, మూడో రోజు ముగిసిన తర్వాత ఇప్పుడు అందరిలో కొన్ని ప్రశ్నలు మొదలయ్యాయి. అదేంటంటే, గాలేలో గెలవడానికి భారత జట్టు ఇంకా ఎన్ని పరుగులు చేయాలి? భారత జట్టు విజయాన్ని ఖాయం చేసే టార్గెట్ ఎంత? గాలేలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరును ఎవరు ఛేజ్ చేశారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇప్పుడు తెలుసుకుందాం..

**గాలేలో పటిష్ట స్థితిలో టీమిండియా..**

తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేసిన శ్రీలంకను, టీమిండియా బౌలర్లు కేవలం 284 పరుగులకే ఆలౌట్ చేశారు. దీంతో టీమిండియా 178 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఇప్పుడు, గాలేలో గెలవడానికి టీమ్ ఇండియా ఇంకా ఎన్ని పరుగులు చేయాల్సి ఉంటుందో తెలుసుకుందాం. గాలేలో టీమిండియా తన ఆధిక్యాన్ని 400 పరుగులకు పెంచుకోగలిగితే, విజయం ఖాయంగా భావించవచ్చు. అంటే, రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా 250 పరుగులు చేస్తే, ఓటమి దాదాపు అసాధ్యం అని లెక్కలు చెబుతున్నాయి.

**గాలేలో అత్యధిక స్కోర్ ఛేదించిన టీం ఏదంటే?**

గాలేలో అత్యధిక స్కోరును 2022లో పాకిస్థాన్ ఛేదించింది. ఆ మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు 342 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, అబ్దుల్లా షఫీక్ సెంచరీ పుణ్యమా అని పాక్ టీం ఆ లక్ష్యాన్ని సాధించింది. ఈ మైదానంలో శ్రీలంక చివరిసారిగా 2019లో న్యూజిలాండ్‌పై 268 పరుగులు చేసి విజయం సాధించింది.

# సిరాజ్ డేంజరస్ త్రో.. జస్ట్ మిస్సైన పాకిస్తాన్ అంపైర్..



భారత్, శ్రీలంక జట్ల మధ్య గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ విసిరిన ఓ డేంజరస్ త్రో నేరుగా అంపైర్ తల వైపు వేగంగా దూసుకొచ్చింది. క్షణాల వ్యవధిలో అంపైర్ తప్పుకోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అసలు మైదానంలో ఆ క్షణంలో ఏం జరిగిందో ఓసారి చూద్దాం..! శ్రీలంక పర్యటనలో ఉన్న భారత జట్టు గాలే అంతర్జాతీయ మైదానంలో తొలి టెస్టు ఆడుతోంది. శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో ఓ ఊహించని సంఘటన చోటు చేసుకుంది. టెస్టు ఫార్మాట్‌లో ప్రతి పరుగూ ఎంతో విలువైనది. ఫీల్డింగ్ చేసే జట్టు ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు ఎప్పుడూ ఒత్తిడి పెంచుతూనే ఉంటుంది. సరిగ్గా ఇలాంటి వాతావరణంలోనే శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్ ఆడుతుండగా, 69వ ఓవర్‌ను స్పిన్నర్ రవీంద్ర జడేజా బౌలింగ్ చేస్తున్నాడు. ఆ ఓవర్ మొదటి బంతిని క్రీజులో ఉన్న బ్యాటర్ సోనాల్ దినూష తెలివిగా రివర్స్ స్వీప్ ఆడాడు. బంతి వేగంగా డీప్ పాయింట్ దిశగా దూసుకెళ్లింది. అక్కడ బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న మహ్మద్ సిరాజ్ వెంటనే అప్రమత్తమై బంతిని అందుకున్నాడు. బ్యాటర్లు అప్పటికే వేగంగా 2 పరుగులు పూర్తి చేసేందుకు పిచ్ పై పరుగెత్తుతుండటంతో, సిరాజ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బంతిని నాన్ స్ట్రైకర్ ఎండ్ వైపు అత్యంత బలంగా విసిరాడు. ఆ త్రో స్పీడ్ ఎంతలా ఉందంటే గ్రౌండ్‌లో ఉన్న ఆటగాళ్లు సైతం ఆశ్చర్యపోయారు.

**క్షణాల్లో ప్రాణాలు దక్కించుకున్న పాకిస్తాన్ అంపైర్..**

సిరాజ్ విసిరిన ఆ రాకెట్ త్రో నేరుగా లెగ్ అంపైర్ స్థానంలో నిల్చున్న పాకిస్థాన్ అంపైర్ ఎహ్సాన్ రజా వైపు వెళ్ళింది. బంతి గాల్లో తన తల వైపు దూసుకురావడాన్ని గమనించిన రజా అద్భుతమైన రిఫ్లెక్సెస్ చూపించాడు. ఏమాత్రం ఆలోచించకుండా తల దించుకుని ఒక్కసారిగా కిందకు వంగాడు. బంతి ఆయన తల పైభాగం నుంచి క్షణాల వ్యవధిలో అత్యంత వేగంగా వెళ్ళిపోయింది. ఒకవేళ రజా సెకను వ్యవధి ఆలస్యం చేసినా, ఆ బలమైన త్రో నేరుగా ఆయన తలకు బలంగా తాకేది. ఈ ఊహించని పరిణామాన్ని చూసి బౌలింగ్ ఎండ్‌లో ఉన్న జడేజాతో పాటు ఫీల్డింగ్ చేస్తున్న భారత ఆటగాళ్లందరు ఓ క్షణం అలాగే ఉండిపోయారు. సిరాజ్ సైతం తాను విసిరిన త్రో అంపైర్ వైపు వెళ్లడం చూసి టెన్షన్ పడ్డాడు. అంపైర్ రజా సురక్షితంగా బయటపడటంతో మైదానంలో ఉన్న వారంతా ఒక్కసారిగా ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com